# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - గురువారం 14 మే 2026 | సంపుటి: 10 | సంచిక: 129 | పేజీలు:12 | వెల రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM |


## లీటర్‌కు రూ.2 పెరిగిన మదర్ డెయిరీ, అమూల్ పాలు




2

## ఇంటర్ ఎగ్జామ్ రాసిన మావోయిస్టు అగ్రనేత



2

# 15 శాతం వృద్ధితో పటిష్ఠ ఆర్థిక వ్యవస్థ: సీఎం చంద్రబాబు





ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ను గాడిలో పెట్టే పనిలో పడ్డారు. ప్రతినెల గణాంకాల సేకరణ పక్కగా సేకరించాలని, దేనికోసం మండల స్థాయి వరకు ఉద్యోగులకు శిక్షణ ఇవ్వాలన్నారు. ప్రధాని మోదీ బాటలో...తన భద్రత సిబ్బందిలో కూడా 50శాతం కోత విధించాలని సీఎం ప్రతిపాదించారు.

**(అమరావతి, పి. మీరా హుస్సేన్ మనం న్యూస్ ప్రత్యేక ప్రతినిధి):** రాష్ట్రాన్ని ఆర్థికంగా మరింత పటిష్ట పరిచేందుకు వ్యవస్థలో సామర్థ్య పెంపు జరగాలని, ఇందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. 15 శాతం వృద్ధి సాధించడం ద్వారా స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాలను చేరుకోగలమని, ఇందుకు వేగంగా గణాంకాలను సేకరించాల్సి ఉంటుందన్నారు. ఇందుకోసం రాష్ట్ర స్థాయి నుంచి మండల స్థాయి వరకు సిబ్బందికి 3 నెలల పాటు శిక్షణ ఇవ్వాలని సీఎం ఆదేశించారు. జీఎస్డీపీ అంచనాలను సంప్రదాయ విధానంలో కాకుండా రియల్టైమ్ మానిటరింగ్ ద్వారా రూపొందించేలా శిక్షణ అందించాలన్నారు. సచివాలయంలో బుధవారం ప్రణాళిక శాఖపై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి... త్వరలోనే పూర్తి స్థాయిలో డేటా డ్రివెన్ గవర్నెన్సు శ్రీకారం చుడతామన్నారు. సమీక్షలో జీఎస్డీపీ కెపాసిటీ బిల్డింగ్, ఏఐ ఆధారిత ఆర్థిక విశ్లేషణ, రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న ప్రధాన సర్వేలు, జిల్లా-మండల స్థాయి అధికారులకు శిక్షణ, కేపీఐల ఆడిటింగ్ అనుసంధానం వంటి అంశాలపై అధికారులతో సీఎం చర్చించారు.

**ఏఐ ఆధారిత ఆర్థిక విశ్లేషణ**

ప్రస్తుతం రాష్ట్ర జీఎస్డీపీ అంచనాలు మూడు నెలలకు, ఏడాది కాలానికి రూపొందిస్తున్నారని, దీంతో ఆర్థిక స్థితిగతులపై తక్షణ అవగాహన సాధ్యం కావడం లేదని సీఎం అభిప్రాయపడ్డారు. చారిత్రక డేటాపై ఎక్కువ ఆధారపడటం వల్ల విధాన నిర్ణయాలు తీసుకోవడంలో ఆలస్యం జరుగుతోందని చెప్పారు. ఈ నేపథ్యంలో

...మిగతా 2లో

## ప్రభుత్వ వాహనాల పొదుపు

పొదుపు చర్యల్లో భాగంగా సీఎం చంద్రబాబు కీలక నిర్ణయలు తీసుకున్నారు. తన కాన్వాయ్లోని వాహనాల కుదింపునకు చంద్రబాబు ఆదేశం జారీ చేశారు.పెట్రోల్, డీజిల్ ఉత్పత్తుల వాడకం తగ్గించాలన్న ప్రధాని మోదీ సూచన మేరకు చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారు. జిల్లా పర్యటనల్లో 50శాతం వాహనాలు తగ్గించాలని డీజీపీ, ఇంటెలిజెన్స్ చీఫ్కు స్పష్టం చేసారు. మంత్రులు, ఇతర వీఐపీలు కూడా తక్కువ వాహనాలు వినియోగించేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. నేటి కేబినెట్ సమావేశంలో చర్చించి మరిన్ని కీలకనిర్ణయాలు సీఎం చంద్రబాబు, ప్రకటించనున్నారు.

## పవన్ కల్యాణ్ భరోసా



**పిఠాపురం, మే13:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిఠాపురం నియోజకవర్గ విద్యార్థులకు శుభవార్త తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షల్లో 580కి పైగా మార్కులు సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉచితంగా ఉన్నత విద్య అందించేందుకు చర్యలు ప్రారంభించారు. విద్యారంగంలో పిఠాపురాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దే దిశగా పవన్

...మిగతా 2లో

## నా కస్టోడియల్ టార్చర్ కేసును వదిలే ప్రసక్తే లేదు: రఘురామ



**పశ్చిమగోదావరి జిల్లా మే 13:** వైసీపీ హయాంలో తనపై నమోదైన కస్టోడియల్ టార్చర్ కేసును వదిలే ప్రసక్తే లేదని ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, తెలుగుదేశం పార్టీ ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు స్పష్టం చేశారు. ఈ కేసుపై తాను పట్టువదలని విక్రమార్కుడిలా న్యాయం కోసం ప్రయత్నిస్తున్నానని వ్యాఖ్యానించారు. బుధవారం పశ్చిమగోదావరి జిల్లాలో రఘురామ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. గురువారం తన పుట్టినరోజు అని.. తన కేసు గురువారం కి ఐదేళ్లు అవుతుందని తెలిపారు. తన కేసులో మూడో ముద్దాయిగా వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఉన్నారని ప్రస్తావించారు.మొదటి ముద్దాయి విచారణకు రాయల్గా వచ్చి రాయల్గా

...మిగతా 2లో

## పాక్ను ఏమాత్రం నమ్మలేను

### అమెరికా సెనెటర్ లిండ్సేగ్రాహం



**వాషింగ్టన్, మే 13 :** అంతర్జాతీయ వ్యవహారాల్లో పాకిస్థాన్ ద్వంద్వ వైఖరిని అమెరికా సెనెటర్ లిండ్సేగ్రాహం తీవ్రంగా

...మిగతా 2లో

## ఆంధ్రప్రదేశ్‌లో భారత్ నెట్ అమలుకు చారిత్రాత్మక ఒప్పందం




2

## ఏపీలో ఆక్వా రైతులను ఆదుకోండి..
# కేంద్రానికి సీఎం లేఖ..



**అమరావతి:** ఆంధ్రప్రదేశ్లో ఆక్వా రైతుల ఇబ్బందులపై కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లేఖ రాశారు. రొయ్యల ఫీడ్ తయారీలో ఉపయోగించే ముడి పదార్థాల ధరలు పెరగడంతో ఆక్వా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. రొయ్యల ఫీడ్ ధరల పెరుగుదల వల్ల రైతులపై పడుతున్న భారం తగ్గించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, ముడి పదార్థాల ధరలను నియంత్రించేందుకు

...మిగతా 2లో

## క్వాంటం కంప్యూటింగ్కు చిరునామాగా అమరావతి: సీఎం




**అమరావతి, మే 13:** రాజధాని అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా నిడమర్రు వద్ద కిమ్స్ ఆస్పత్రికి భూమి పూజ చేశారు. బైసర్ స్కిల్ వర్సిటీ నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. సంపద సృష్టించడం చాలా సులభమన్నారు. దేశానికే మెడికల్ హబ్ గా హైదరాబాద్ తయారైందని తెలిపారు. లక్ష మందికి స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ ఇస్తామని.. వైద్యులు కూడా ఏఐని నేర్చుకుంటున్నారని అన్నారు.వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అరాచకం గతంలో ఎప్పుడూ చూడలేదని సీఎం విమర్శించారు. లక్ష మందికి ఉద్యోగాలు ఇవ్వాలనేదే కూటమి ప్రభుత్వ ఆలోచన అని స్పష్టం చేశారు. 2027 మే 13న కిమ్స్ ఆస్పత్రిని ప్రారంభిస్తామని అన్నారు. 2028 ఆగస్టు 15 కంటే ముందే విశాఖలో గూగుల్ ఆపరేషన్లు మొదలవుతాయని

...మిగతా 2లో

### బల ప్రదర్శనలో సక్సెస్ 'సాధించిన' జోసెఫ్ విజయ్

టీవీకే సర్కారుకు 144 మంది ఎమ్మెల్యేల మద్దతు

చీలిపోయిన అన్నాడీఎంకే



2

## అత్యంత శక్తిమంతమైన క్షిపణిని పరీక్షించిన రష్యా

2

### భారత్‌కు చమురు సరఫరాలో
## ఆటంకం రానివ్వం

- రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్
- ప్రపంచం చూసిన శక్తిమంతమైన నాయకుల్లో ప్రధాని మోదీ ఒకరంటూ ప్రశంస

2



### పొదుపునకు శ్రీకారం చుట్టిన ప్రధాని
## మోదీ కాన్వాయ్‌లో వాహనాల సంఖ్య తగ్గింపు

అదే బాటలో అమిత్ షా, కేంద్రమంత్రులు, బీజేపీ ముఖ్యమంత్రులు

2

# రాష్ట్రంలో ఏపీ మోడల్

బీజేపీకి టీడీపీ, జనసేనను దగ్గర చేసే యత్నం

చంద్రబాబు, పవన్‌తో ప్రధాని మోడీ భేటీ వెనక వ్యూహమిదే

రాష్ట్రంలోని సొంత పార్టీ నేతలపై విశ్వాసం లేని మోడీ



2

### ఖరీఫ్ పంటలకు
# కనీస మద్దతు ధర పెంపు



కోల్ గ్యాసిఫికేషన్ పథకం ప్రకటన

కేంద్ర కేబినెట్ నిర్ణయాలను

వెల్లడించిన మంత్రి అశ్వినీ వైష్ణవ్

**ఢిల్లీ, మే 13 :** వరితో పాటు పలు పంటలకు కేంద్రం కనీస మద్దతు ధరను పెంచింది. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో కోల్ గ్యాసిఫికేషన్ పథకాన్ని ప్రకటించింది. ప్రధానమంత్రి మోడీ అధ్యక్షతన బుధవారం జరిగిన కేంద్ర కేబినెట్ భేటీలో పలు నిర్ణయాలకు ఆమోదం లభించింది. పశ్చిమాసియా సంక్షోభం, పెరుగుతున్న గ్లోబల్ ఆయిల్ రేట్స్, ఇంధన సంరక్షణ, వర్క్ ఫ్రమ్ హోమ్, ఆన్లైన్ క్లాసెస్, బంగారం కొనుగోళ్ల వాయిదాపై

...మిగతా 2లో

### ఐఆర్జీసీ ఆర్థిక మూలాల గురించి చెబితే రూ.145 కోట్లు..
# ఓపెన్ ఆఫర్ ప్రకటించిన అమెరికా



**ఇరాన్‌ను లొంగదీసుకునే వ్యూహంలో భాగంగానే ఈ ఆఫర్ అన్న అగ్రరాజ్యం**

**వాషింగ్టన్, మే 13 :** పశ్చిమాసియా యుద్ధాన్ని ముగించడానికి అమెరికా-ఇరాన్ ప్రయత్నిస్తున్నట్టే కనిపిస్తున్నా.. అయినా, కార్యాచరణలో మాత్రం పురోగతి కనిపించడం లేదు. యుద్ధాన్ని ముగించడానికి వాషింగ్టన్ చేసిన ప్రతిపాదనలను టెహ్రాన్ అంగీకరించకపోవడంతో ఒప్పందం మరింత ఆలస్యమవుతోంది. ఈ క్రమంలో అమెరికా ఇరాన్ మూలాలపై దెబ్బ తీసే వ్యూహం పన్నుతోంది. దీనిలో భాగంగానే

...మిగతా 2లో

## బీజింగ్‌లో దిగిన ట్రంప్

చైనాలో మూడు రోజులు పర్యటించనున్న అమెరికా అధ్యక్షుడు

నేడు షి జిన్‌పింగ్‌తో ద్వైపాక్షిక చర్చలు

పలు వాణిజ్య ఒప్పందాలపై సంతకాలు?



**బీజింగ్, మే 13 :** చైనాలో తన మూడు రోజుల పర్యటన కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బీజింగ్ కు చేరుకున్నారు. ఇరాన్ యుద్ధం, చైనాతో వాణిజ్యం, తైవాన్ కు అమెరికా ఆయుధాల విక్రయం, ప్రాంతీయ భద్రత, కృత్రిమ మేధస్సు వంటి విషయాలపై ఆ

...మిగతా 2లో

# లీటర్‌కు రూ.2 ధర పెరిగిన మదర్ డెయిరీ, అమూల్ పాలు

హైదరాబాద్, మే 13 : అమూల్ బ్రాండ్ పాల ధరలు లీటర్ కు రూ.2 పెరిగాయి. పాలు, పాల ఉత్పత్తులపై పెరిగిన ధరలు నేటి నుంచే అమలులోకి వచ్చాయి. అమూల్ స్టాండర్డ్ మిల్క్, గేదె పాలు, ఆవు పాలు, గోల్డ్, స్లిమ్ ట్రిమ్, టీ-స్పెషల్ పాల ధరలు లీటరుకు రూ.2 చొప్పున పెరగనున్నాయి. ఉత్పత్తి వ్యయం పెరిగిన నేపథ్యంలో ధరల పెంపు నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని అమూల్ తెలిపింది. ఆహార పదార్థాల ద్రవ్యోల్బణంతో పోలిస్తే ఈ పెంపు తక్కువేనని పేర్కొంది.

**మదర్ డెయిరీ కూడా..**

మదర్ డెయిరీ కూడా లీటరుకు రూ.2 చొప్పున పెంచుతున్నట్లు ప్రకటించింది. పాల ధరలను అమూల్, మదర్ డెయిరీ పెంచిన నేపథ్యంలో ఇతర కంపెనీలూ రేటు పెంచే అవకాశాలున్నాయి.

## ఇంటర్ ఎగ్జామ్ రాసిన మావోయిస్టు అగ్రనేత

కరీంనగర్, మే 13 : మావోయిస్టు మాజీ అగ్రనేత తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ ఇంటర్ పరీక్షకు హాజరయ్యారు. దాదాపు 45 ఏండ్ల తర్వాత జగిత్యాల జిల్లా కోరుట్లలో ఆయన ఈ పరీక్ష రాశారు.

1980-82లో కోరుట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ చదివారు. విద్యార్థి రాడికల్ యూనియన్లో పనిచేస్తున్న సమయంలో సెకండియర్ తెలుగు పరీక్షను ఆయన బహిష్కరించారు. ఇటీవలే పోలీసుల ఎదుట లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిసిన ఆయన.. ఇంటర్ బోర్డు ప్రత్యేక అనుమతి తీసుకుని బుధవారం కోరుట్లలోని మ్యాస్ట్రో జూనియర్ కళాశాలలో తెలుగు పరీక్ష రాశారు. న్యాయవాద కోర్సు చేసి పేదల కోసం పనిచేస్తానని దేవ్ జీ తెలిపారు.

# మోడీ కాన్వాయ్‌లో వాహనాల సంఖ్య తగ్గింపు

ఢిల్లీ, మే 13 : పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో పొదుపు పాటించాలంటూ ప్రధాని నరేంద్ర మోడీ ఇటీవలే హైదరాబాద్ కేంద్రంగా ప్రజలకు పిలుపునిచ్చిన విషయం పాఠకులకు విదితమే. ప్రజలకు పొదుపు మంత్రాలు సూచించిన మోడీ స్వయంగా వాటిని పాటించేందుకు సిద్ధమయ్యారు. తన అధికారిక కాన్వాయ్ లోని వాహనాల సంఖ్యను 50 శాతం తగ్గించాలని ప్రధాని ఆదేశించినట్లు మీడియాలో కథనాలు వస్తున్నాయి.

ఆ వార్తా కథనాల ప్రకారం.. ప్రస్తుత ఉద్రిక్తతల వేళ ఇంధన ఆదా అమలుచేయాలని నిర్ణయించుకున్న మోడీ తన కాన్వాయ్లోని వాహనాల సంఖ్యను తగ్గించాలని స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్‌కి సూచించారు. దీంతోపాటు కాన్వాయ్లో ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) వినియోగాన్ని పెంచాలని ఆదేశించారు. అయితే, ఇందుకోసం కొత్తగా ఎలాంటి వాహనాలను కొనుగోలు చేయకూడదని స్పష్టంచేశారు. భద్రతా ప్రొటోకాల్స్‌కు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకుంటూనే ఎస్పీజీ ఈ ఆదేశాలను అమలుచేయడం ప్రారంభించినట్లు తెలుస్తోంది.

సాధారణంగా, ప్రధాని కాన్వాయ్లో మెర్సిడెస్ అల్ట్రా లగ్జరీ కారు, రేంజ్ రోవర్లు, టయోటా ఫార్చ్యూనర్లు, ఎస్కార్ట్ వాహనాలు, జామర్ యూనిట్లు సహా కనీసం 12-15 వాహనాలు ఉంటాయి. ఈ వాహనాల సంఖ్యను 50 శాతం తగ్గించినట్లు స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్పీజీ) అధికారులు వెల్లడించారు. ప్రొటోకాల్ ప్రకారం ఆయన వెళ్లే దారుల్లో తప్పనిసరి భద్రతా ఏర్పాట్లు కొనసాగిస్తామన్నారు.

**మోడీ దారిలోనే అమిత్ షా..**

ఇంధన పొదుపుపై ప్రధాని పిలుపు మేరకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా సహా పలువురు కేంద్ర మంత్రులు తమ కాన్వాయ్ సైజును రెండు వాహనాలకు కుదించుకున్నారు.

**ముఖ్యమంత్రులు కూడా..**

ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తా, మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ సహా ఇతర మంత్రులు కూడా తమ అధికారిక కాన్వాయ్లోని వాహనాల సంఖ్యను ఇప్పటికే తగ్గించుకున్నారు.

## భారత్‌కు చమురు సరఫరాలో ఆటంకం రానివ్వం

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడారు. ప్రపంచం చూసిన శక్తిమంతమైన నాయకుల్లో ప్రధాని మోడీ ఒకరని కొనియాడారు. ఆర్థిక వ్యవస్థ, సైన్యం, సంస్కృతి.. ఇలా అన్ని రంగాల్లో భారత్ సార్వభౌమాధికారాన్ని సాధించడమే లక్ష్యంగా ఆయన పనిచేస్తున్నారని చెప్పారు.

'ఇంధన సరఫరాల బాధ్యతలను నెరవేర్చడంలో రష్యా ఎన్నడూ విఫలం కాలేదు. ఈ విషయంలో భారత ప్రయోజనాలకు ఎటువంటి నష్టం జరగనివ్వం. చమురు సరఫరాలో ఆటంకం రానివ్వం. అన్యాయమైన, నిజాయతీ లేని పోటీ మార్కెట్.. ఇరుదేశాల మధ్య ఒప్పందాలను దెబ్బతీయకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటాం. కుడంకుళం అణు విద్యుత్ కేంద్రం కోసం కొత్త పవర్ యూనిట్ల నిర్మాణంలో మా సహకారం కొనసాగుతోంది. భారత అవసరాల దృష్ట్యా గ్యాస్, చమురు, బొగ్గు వంటివి సరఫరా చేస్తూనే ఉంటాం. భారత్- రష్యా సంబంధాలను బలహీనపరిచేందుకు కొందరు చేస్తున్న ప్రయత్నాల పట్ల అప్రమత్తత అవసరం.

'హిందీ- రూసీ భాయ్ భాయ్' అనేది సరదా నినాదం మాత్రమే కాదు. అది మన సంస్కృతీపరమైన సంబంధాల్లో భాగం. భారతీయ సినిమాలు, రాజ్ కపూర్, టెలివిజన్ సిరీస్లు ఇవన్నీ రష్యాలో ప్రతిచోటా ప్రజాదరణ పొందాయి. ఆర్థిక వ్యవస్థ, సైనిక సహకారం, ఇంధన సరఫరాలు, సాంస్కృతిక- మానవతా సంబంధాల వంటి అనేక అంశాల్లో ఇరుదేశాల మధ్య సంబంధాలు దృఢంగా ఉన్నాయి'' అని లావ్రోవ్ అన్నారు. భారత పర్యటన సందర్భంగా విదేశాంగశాఖ మంత్రి జై శంకర్ తో లావ్రోవ్ చర్చలు జరపనున్నారు.

## బల ప్రదర్శనలో సక్సెస్ 'సాధించిన' విజయ్

చెన్నై, మే 13 : తమిళనాడు నూతన ముఖ్యమంత్రిగా ఎన్నికైన టీవీకే అధినేత విజయ్ శాసనసభలోనూ తన బలాన్ని నిరూపించుకున్నారు. బుధవారం జరిగిన బలపరీక్షలో విజయ్ ప్రభుత్వం స్పష్టమైన మెజార్టీతో నెగ్గింది. బలపరీక్షకు సంబంధించి ఈ ఉదయం విజయ్ సభలో తీర్మానం ప్రవేశపెట్టారు. దీనిపై చర్చ చేపట్టిన అనంతరం స్పీకర్ ఓటింగ్ నిర్వహించారు. ఇది ఆసక్తికరంగా సాగింది. సాధారణ ఓటింగ్ మాదిరిగా కాకుండా ఒక్కో సభ్యుడి పేరు పిలుస్తూ ఎమ్మెల్యేల సమ్మతిని సభాపతి నమోదు చేసుకున్నారు. ఇందులో విజయ్ ప్రభుత్వానికి మద్దతుగా 144 మంది ఎమ్మెల్యేలు ఓటేశారు. 22 మంది సభ్యులు వ్యతిరేకించారు. బలపరీక్ష సమయంలో అసెంబ్లీ నుంచి డీఎంకే సభ్యులు వాకౌట్ చేశారు. టీవీకే ప్రభుత్వానికి కాంగ్రెస్, వీసీకే, ఐయూఎంఎల్ పార్టీలు మద్దతిచ్చాయి. అన్నాడీఎంకే రెబల్ ఎమ్మెల్యేలు కూడా సీఎంకు అనుకూలంగా ఓటేశారు. అంతకుముందు చర్చ సందర్భంగా శాసనసభలో ఒకింత గందరగోళం నెలకొంది. అన్నాడీఎంకే అధినేత, మాజీ సీఎం పళనిసామి మాట్లాడుతూ.. విజయ్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. తమ ఎమ్మెల్యేలకు ఆయన డబ్బులు ఆఫర్ చేశారని ఆరోపించారు. బలపరీక్షకు ముందు తమ పార్టీ ఎమ్మెల్యేలను సీఎం కలవడం సమంజసం కాదని పేర్కొన్నారు. అన్నాడీఎంకే పార్టీ ఐక్యంగానే ఉందని తమ ఎమ్మెల్యేలంతా విజయ్‌కు వ్యతిరేకంగా ఓటేస్తారని పళనిస్వామి తెలిపారు. అయితే, ఈ వ్యాఖ్యలను అన్నాడీఎంకే రెబల్ వర్గం ఎమ్మెల్యేలు ఖండించారు. తామంతా విజయ్‌కు మద్దతిస్తామని రెబల్ వర్గం నేత వేలుమణి స్పష్టంచేశారు. ఇక చర్చలో డీఎంకే ఎమ్మెల్యే ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ విజయ్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ''ఈ రాష్ట్రానికి రియల్ ప్రభుత్వం కావాలి. రీల్ ప్రభుత్వం కాదు. టీవీకే ప్రభుత్వానికి మెజార్టీ లేదు. మా కూటమిలోని పార్టీలు ఇప్పుడు మద్దతివ్వడం వల్లే విజయ్ గట్టెక్కగలుగుతున్నారు. ప్రభుత్వ ఏర్పాటు కోసం ఎమ్మెల్యేల కొనుగోళ్లకు పాల్పడ్డారు. దీనివల్ల రాష్ట్ర ప్రతిష్ఠ దెబ్బతింటోంది'' అని ఉదయనిధి విమర్శించారు.

### ఐఆర్జీసీ ఆర్థిక మూలాల గురించి చెబితే రూ.145 కోట్లు..

## ఓపెన్ ఆఫర్ ప్రకటించిన అమెరికా

(మొదటి పేజీ తరువాయి)

అగ్రరాజ్య విదేశాంగ శాఖ కీలక ప్రకటన చేసింది. ఐఆర్జీసీ ఆర్థిక మూలాలు చెప్పిన వారికి రూ.145 కోట్ల వరకు బహుమతిగా ఇస్తామని బహిరంగంగా ఆఫర్ చేసింది. ఐఆర్జీసీ.. దాని సంబంధిత శాఖలకు కీలక ఆర్థిక వనరులను అందించే బినామీ కంపెనీలు, వ్యక్తులు, ఆర్థిక సంస్థల సమాచారాన్ని తమకు తెలియజేయాల్సిందిగా కోరింది. గల్ఫ్ దేశాలపై దాడులు చేయకుండా.. అణు కార్యక్రమాలు చేపట్టకుండా ఇరాన్ ను ఆర్థికంగా దెబ్బతీయడం కోసమే ఈ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించింది. మరో వైపు.. యుద్ధం ముగించేందుకు ఉపయోగపడే ప్రతి అవకాశాన్ని వినియోగించుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాగేర్ గాలిబఫ్ ప్రకటించారు. కాని పక్షంలో ఏవిధమైన దురాక్రమణకైనా తగిన గుణపాఠం చెప్పేందుకు తమ సాయుధ దళాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. తప్పుడు అంచనాలు.. తప్పుడు నిర్ణయాలతో కూడిన వ్యూహం ఎల్లప్పుడూ తప్పుడు ఫలితాలనే ఇస్తుందన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే ప్రపంచమంతా అర్థం చేసుకుందన్నారు. అమెరికాతో చర్చల్లో భాగంగా తాము ప్రతిపాదించిన అంశాలను అంగీకరించడం తప్ప అమెరికాకు మరో ప్రత్యామ్నాయం లేదని పేర్కొన్నారు.

**మళ్లీ ఇరాన్ క్షిపణి కార్యక్రమాలు...**

యుద్ధంలో ఇరాన్ క్షిపణి సామర్థ్యాలను నాశనం చేశామని అమెరికా అధ్యక్షుడు చెప్తున్నా.. అగ్రరాజ్య నిఘా వర్గాలు మాత్రం అందుకు వ్యతిరేకమైన ఆధారాలను బహిర్గతం చేశాయి.

# ఆంధ్రప్రదేశ్ లో భారత్ నెట్ అమలుకు చారిత్రాత్మక ఒప్పందం

ఢిల్లీ, మే 13: ఆంధ్రప్రదేశ్ లో డిజిటల్ కనెక్టివిటీని మరింత విస్తరించే దిశగా కీలక ముందడుగు పడింది. భారత్ నెట్ అమలుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం, బీఎస్ఎన్ఎల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మధ్య చారిత్రాత్మక ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలకు హై-స్పీడ్ బాడ్‌బ్యాండ్ సేవలను విస్తరించేందుకు భారీ ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఆంధ్రప్రదేశ్ లో 'సవరించిన భారత్ నెట్ ప్రోగ్రామ్' అమలుకు కేంద్ర ప్రభుత్వం రూ.2,432 కోట్ల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేసింది. ఈ నిధులు డిజిటల్ భారత్ నిధి ద్వారా విడుదల కానున్నాయి. ఈ ప్రాజెక్టు అమలుతో రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలు వేగవంతం కావడంతో పాటు టెలికాం మౌలిక వసతులు మరింత బలోపేతం కానున్నాయి.కొత్త ఒప్పందం ప్రకారం ఆంధ్రప్రదేశ్లోని 13,426 గ్రామ పంచాయతీలకు హై-స్పీడ్ బాడ్ బ్యాండ్ కనెక్టివిటీ అందించనున్నారు. ఫైబర్ నెట్ నెట్వర్కు విస్తరించడం ద్వారా గ్రామీణ ప్రజలకు వేగవంతమైన ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ప్రత్యేకంగా విద్య, వైద్యం, వ్యవసాయం, ఈ-గవర్నెన్స్ సేవలు గ్రామీణ ప్రాంతాల్లో మరింత సులభంగా చేరేలా ఈ ప్రాజెక్టు ఉపయోగపడనుంది.రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లో ఉన్న 3,943 గ్రామాలకు 'ఆన్-డిమాండ్ కనెక్టివిటీ' సౌకర్యం కల్పించనున్నారు. ఇప్పటివరకు సరైన నెట్వర్క్ లేని ప్రాంతాల్లో కూడా ఇంటర్నెట్ సేవలు అందించేందుకు ప్రత్యేక సాంకేతిక వ్యవస్థలను వినియోగించనున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ సేవలు మరింత వేగంగా విస్తరించే అవకాశం ఏర్పడింది.

## బీజింగ్‌లో దిగిన ట్రంప్

(మొదటి పేజీ తరువాయి)

దేశాధ్యక్షుడు షి జిన్పింగ్‌తో ఆయన చర్చించనున్నారు. తొమ్మిదేళ్ల అనంతరం ట్రంప్ చైనాకు వచ్చారు. చివరిసారిగా ఆయన 2017లో అధ్యక్ష హోదాలో చైనాను సందర్శించారు. ఇరాన్ తో యుద్ధం... హర్మూజ్ జలసంధి దిగ్బంధనం... ప్రపంచ ఆర్థిక సంక్షోభానికి దారితీసిన పరిస్థితుల్లో ట్రంప్ చైనా పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.

**మస్క్, టిమ్ కుక్, పలువురు ఐటీ సీఈఓలు కూడా..**

చైనా అధ్యక్షుడు జిన్పింగ్తో చర్చల కోసం అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో పాటు తాను కూడా బీజింగ్ కు వెళ్లినట్లు ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ పేర్కొన్నారు.

అమెరికా అధికారులతో పాటు యాపిల్ సీఈవో టిమ్ కుక్, ఎన్విడియాకు చెందిన జెన్సన్ హువాంగ్ వంటి దేశ అగ్రశ్రేణి కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్ లు చైనాకు వెళ్లినట్లు తెలుస్తోంది. దీంతో టెక్నాలజీకి సంబంధించి చైనాతో అమెరికా పెద్ద ఒప్పందం చేసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం వెలువడుతోంది.

### ఏపీలో ఆక్వా రైతులను ఆదుకోండి..

## కేంద్రానికి సీఎం లేఖ..

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రం చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని ఆక్వా రైతులను ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. ఫీడ్ ధరల పెరుగుదల కారణంగా రైతుల పెట్టుబడి వ్యయం గణనీయంగా పెరిగిందని, ఒక్కో టన్ను ఫీ సుమారు రూ.25 వేల వరకు అదనపు భారం పడుతోందని లేఖలో పేర్కొన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే రొయ్యల సాగు తగ్గే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దేశీయ అవసరాలకు సరిపడా ముడి పదార్థాల లభ్యత ఉండేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని చంద్రబాబు కోరారు. సోయాబీన్ మీల్, సోయా ఆయిల్ దిగుమతులపై సడలింపులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.రైతులకు అందుబాటు ధరల్లో రొయ్యల ఫీడ్ లభించేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు కోరారు. అలాగే, ఫీడ్ ధరల పర్యవేక్షణ కోసం ప్రత్యేక యంత్రాంగం ఏర్పాటు చేయాలని సూచించారు. ఆక్వా రైతుల సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు తన లేఖలో పేర్కొన్నారు.

## పాక్ను ఏమాత్రం నమ్మలేను

(మొదటి పేజీ తరువాయి)

ఖండించారు. పాకిస్థాన్‌ను ఏమాత్రం నమ్మలేనని వ్యాఖ్యలు చేశారు. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా-ఇరాన్ శాంతి ఒప్పందం కోసం పాకిస్థాన్ మధ్యవర్తిత్వం వహిస్తోన్న సంగతి తెలిసిందే. ఇలాంటి సమయంలో ఇరాన్‌కు పాక్ సైనికంగా సహకరించిందన్న ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలోనే లిండ్సే స్పందన వచ్చింది.

''నేను పాకిస్థాన్‌ను ఏమాత్రం నమ్మలేను. ఆ దేశాన్ని వీలైనంత దూరంగా ఉంచుతాను. ఇరాన్ విమానాల పార్కింగ్‌కు పాక్ అనుమతిస్తే.. మధ్యవర్తిత్వానికి అమెరికా వేరొక దేశాన్ని వెతుక్కోవాలి. అందుకేనేమో శాంతి ఒప్పందం అంశం ఏటూ తేలడం లేదు'' అని సెనెటర్ అనుమానాలు వ్యక్తంచేశారు. ఇటీవల అమెరికా దాడుల భయంతో ఇరాన్ తన వైమానిక దళానికి చెందిన కొన్ని యుద్ధ విమానాలను పాకిస్థాన్‌లోని స్థావరాలకు తరలించిందని వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. గూఢచర్య, నిఘా కార్యకలాపాలకు వినియోగించే ప్రత్యేక ఆర్సీ-130 విమానం కూడా అందులో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఈ కథనాలను పాకిస్థాన్ అధికారులు తోసిపుచ్చారు. తమ ఎయిర్‌బేస్‌లలో ఇరాన్ సైనిక విమానాలకు ఆశ్రయం ఇచ్చినట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదని ఆ దేశ సీనియర్ అధికారి పేర్కొన్నారు. ఇదిలాఉంటే.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాత్రం పాకిస్థాన్‌కు అనుకూలంగా మాట్లాడారు. తమ దేశం మరో మధ్యవర్తిని వెతకడం లేదని వెల్లడించారు.

## అత్యంత శక్తిమంతమైన క్షిపణిని పరీక్షించిన రష్యా

మాస్కో , మే 13 : సరికొత్త ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి సార్మాట్‌ను రష్యా మంగళవారం పరీక్షించింది. అణ్వస్త్ర బలగాలను బలోపేతం చేయడంలో భాగంగా ఈ ప్రయోగాన్ని చేపట్టింది. దీన్ని ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన క్షిపణిగా రష్యా అధ్యక్షుడు పుతిన్ అభివర్ణించారు. సోవియట్ కాలం నాటి వోయేవోడ అస్త్రాల స్థానంలో దీన్ని ప్రవేశపెడతామన్నారు. అణ్వస్త్ర సామర్థ్యం కలిగిన సార్మాట్ క్షిపణి ఈ ఏడాది చివరలో సైనిక దళాల్లో చేరుతుందని చెప్పారు. ఈ క్షిపణిలోని వార్‌హెడ్‌ల ఉమ్మడి శక్తి.. పశ్చిమ దేశాలకు చెందిన ఏ అస్త్రం కన్నా కూడా నాలుగు రెట్లు అధికమని చెప్పారు. సార్మాట్ క్షిపణిని సాటన్-2గా కూడా పిలుస్తారు. దీని అభివృద్ధి 2011లో ప్రారంభమైంది. 2024లో దీన్ని పరీక్షించేటప్పుడు భారీ పేలుడు చోటుచేసుకుంది. సార్మాట్‌కు అమెరికాకు చెందిన గగనతల రక్షణ వ్యవస్థలన్నింటినీ బోల్తా కొట్టించే సత్తా ఉందని పుతిన్ పేర్కొన్నారు. 35వేల కిలోమీటర్లకుపైగా పరిధిని ఇది కలిగి ఉందన్నారు.

# పవన్ కల్యాణ్ భరోసా

(మొదటి పేజీ తరువాయి)

కల్యాణ్ ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నారు.పిఠాపురం నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది పది పరీక్షల్లో 580కి పైగా మార్కులు సాధించిన మొత్తం 31 మంది విద్యార్థులను గుర్తించారు. వీరికి ఇంటర్ నుంచి ఉన్నత విద్య వరకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు ఉప ముఖ్యమంత్రి కార్యాలయం ప్రత్యేకంగా ముందుకొచ్చింది. విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువును మధ్యలో ఆపకుండా ఉండేందుకు పూర్తి స్థాయి విద్యా భరోసా కల్పించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవతో పలు ప్రైవేట్ విద్యా సంస్థలు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యమయ్యాయి. ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఉచిత సీట్లు, హాస్టల్ సదుపాయం, పుస్తకాలు, ఇతర విద్యా అవసరాలను అందించేందుకు విద్యా సంస్థలు ముందుకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

# రాష్ట్రంలో ఏపీ మోడల్

హైదరాబాద్, మే 13 (మనం బ్యూరో) : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీలతో కలిపి రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ప్రధాని మోడీ భావిస్తున్నారా? రాష్ట్ర బీజేపీ నేతలకు సొంతంగా పార్టీని అధికారంలోకి తీసుకొచ్చే సీన్ లేదన్న భావనతో ఎన్డీయే కూటమిని ప్రజలకు దగ్గర చేయాలని చూస్తున్నారా? ఇటీవల ప్రధాని మోడీ రాష్ట్ర పర్యటన సందర్భంగా జరిగిన పరిణామాలను చూస్తే అవుననే సమాధానం వస్తోంది. అభివృద్ధి, శంకుస్థాపనల కోసం గత ఆదివారం హైదరాబాద్ వచ్చిన ప్రధాని మోడీ టీడీపీ అధినేత, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో సమావేశమయ్యారు. చంద్రబాబుతో దాదాపు గంటకు పైగా సమావేశమైన ప్రధాని రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలపై చర్చించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ, జనసేన మూడు పార్టీలు కలిపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అంశంపైనా వీరిద్దరూ చర్చించినట్లు వార్తలు వెలువడ్డాయి. మరోవైపు, ప్రధాని మోడీ జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తోనూ విడిగా సమావేశమయ్యారు. ఆయనతో జరిగిన సమావేశంలోనూ ప్రధాని రాష్ట్ర రాజకీయాలపైనే ప్రధానంగా చర్చించినట్లు సమాచారం. తెలంగాణలో రూ.9614 కోట్ల అభివృద్ధి పనులు, శంకుస్థాపనలు చేసినందుకు రాష్ట్ర ప్రజల పక్షాన పవన్ కల్యాణ్ ప్రధాని మోడీకి ట్విట్టర్ ద్వారా కృతజ్ఞతలు తెలియజేయడం గమనార్హం. ఇవన్నీ చూస్తుంటే రాష్ట్ర బీజేపీ నేతలకు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని సొంతంగా అధికారంలోకి తీసుకొచ్చేంత సీన్ లేదనీ, అందుకే ఇప్పటి నుండే ప్రధాని మోడీ ఎన్డీయే కూటమిలో భాగస్వాములైన టీడీపీ, జనసేనతో సఖ్యతగా మెలగాలన్న వ్యూహంతో ముందుకు సాగుతున్నట్లు స్పష్టమవుతోంది. సాధారణంగా ప్రధాని మోడీ ఏ రాష్ట్రానికి వచ్చినా స్థానిక నేతలతో భేటీ కావడం, ఆ రాష్ట్రంలోని తాజా రాజకీయాల పరిణామాలపై చర్చించడం జరుగుతుంటుంది. రాష్ట్రానికి సంబంధించి బీజేపీ నుంచి ఉన్న ఇద్దరు కేంద్ర మంత్రులను, పార్టీ స్టేట్ చీఫ్‌నూ పక్కనబెట్టి ఎన్డీయే కూటమి భాగస్వాములైన టీడీపీ, జనసేన అధినేతలతో ప్రత్యేకంగా సమావేశం కావడం వెనక ప్రధాని రాష్ట్రంలోని సొంత పార్టీ నేతలకు అంతగా ప్రాధాన్యం ఇవ్వడం లేదనే విషయం స్పష్టమవుతోంది. ముందుగా మీడియాకు విడుదల చేసిన ప్రధాని షెడ్యూల్‌లో బేగంపేట ఎయిర్‌పోర్ట్‌లో బీజేపీ రాష్ట్ర నేతలతో సమావేశమవుతారని పేర్కొన్నారు. అయితే, పరేడ్ గ్రౌండ్స్‌లో బహిరంగ సభ ముగిసిన వెంటనే రాష్ట్ర బీజేపీ నేతలతో సమావేశం కాకుండానే తిరుగు ప్రయాణం కావడం ఈ వాదనకు బలం చేకూరుస్తున్నది. దీనికి తోడు ఇటీవల జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థి కనీసం డిపాజిట్ కూడా దక్కించుకోలేక పోయారు. అలాగే, స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ బీజేపీ అంతగా ప్రభావం కనబర్చలేక పోయింది. ఈ పరిణామాల నేపథ్యంలోనే ప్రధాని మోడీ రాష్ట్ర పర్యటన సందర్భంగా సొంత పార్టీ నేతలను పక్కనబెట్టి టీడీపీ, జనసేన పార్టీల అధినేతలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చినట్టు పార్టీలో జోరుగా చర్చ సాగుతోంది.

# ఖరీఫ్ పంటలకు కనీస మద్దతు ధర పెంపు

(మొదటి పేజీ తరువాయి)

మంత్రివర్గం చర్చించినట్లు సమాచారం. కేంద్ర కేబినెట్ నిర్ణయాలను మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు ప్రకటించారు.

2026-27 ఖరీఫ్ పంటల కనీస మద్దతు ధరకు ఆమోదం తెలిపిన మంత్రి వర్గం దానికోసం రూ.2.6 లక్షల కోట్లు కేటాయించింది. క్వింటాల్ వరికి కనీస మద్దతు ధర రూ.2,441గా నిర్ణయించారు. వరి(ఏ గ్రేడ్)కి రూ.2,461కి పెంచారు. క్వింటాల్ జొన్నలు(హైబ్రిడ్) కనీస మద్దతు ధర రూ.4,023గా ఇవ్వనున్నట్లు మంత్రి వెల్లడించారు. జొన్నలు (మల్దండి) ధర రూ.4,073గా నిర్ణయించారు.

**ఖరీఫ్ మద్దతు ధరలకు రూ.2.60 లక్షల కోట్ల కేటాయింపు**

దేశవ్యాప్తంగా కనీస మద్దతు ధరల అమలుకు కేంద్ర కేబినెట్ రూ.2,60,000 కోట్ల కేటాయింపునకు ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయం ద్వారా రైతులకు పంటలకు గిట్టుబాటు ధర లభించడంతో పాటు వ్యవసాయ రంగానికి ఆర్థిక భరోసా లభించనుంది.

**కొత్త ఎంఎస్‌పీ ధరలివే..**

ఖరీఫ్ పంటలకు కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ)లిలా ఉన్నాయి..

వరి (సాధారణ రకం) - రూ.2441
వరి (గ్రేడ్ ఏ) - రూ.2461
హైబ్రిడ్ జొన్నలు - రూ.4023
మల్దండి జొన్నలు - రూ.4073
సజ్జలు - రూ. 2900
రాగులు - రూ.525
మొక్కజొన్న - రూ. 2410
కందులు - రూ. 8450
పెసర్లు - రూ.8780
మినుములు - రూ.8200
పత్తి (మధ్యరకం) - రూ.8267
పత్తి (లాంగ్ రకం) - రూ. 8667
వేరుశనగ - రూ.7517
పొద్దుతిరుగుడు - రూ.8343
సోయాబీన్ - రూ.5708
నువ్వులు - రూ.10,346
ఒడిసలు - రూ.10,052

**కోల్ గ్యాసిఫికేషన్‌కు అగ్రపీఠం**

పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో బొగ్గు వినియోగాన్ని ఆధునీకరించేందుకు కోల్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులకు రూ.37,500 కోట్ల కేటాయింపునకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు ద్వారా దిగుమతి ఇంధనాలపై ఆధారాన్ని తగ్గించడంతో పాటు దేశీయ పరిశ్రమలకు మద్దతు లభించనుంది.

'భారత్ ప్రపంచంలోనే ఎక్కువ బొగ్గు నిల్వలు ఉన్న దేశాల్లో ఒకటి. మనకు సరిపడా బొగ్గు నిల్వలు ఉన్నాయి. బొగ్గు నుంచి గ్యాసును ఉత్పత్తి చేయడంపై దృష్టిసారించాం. 75 మిలియన్ టన్నుల బొగ్గును గ్యాసిఫై చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నాం. కోల్ గ్యాసిఫికేషన్ ప్లాంట్లు ఏర్పాటు చేసే ప్రైవేటు సంస్థలకు ప్రోత్సాహకాలు అందిస్తాం. ఈ గ్యాసిఫికేషన్ ద్వారా 50 వేలమందికి ఉద్యోగాలు లభిస్తాయి. ఏడాదికి రూ.6,300 కోట్ల ఆదాయం వస్తుంది. ప్రస్తుతమున్న అంతర్జాతీయ పరిస్థితులు అందరికీ తెలుసు. ఈ క్రమంలోనే తాజా నిర్ణయం తీసుకున్నాం' అని మంత్రి తెలియజేశారు.

**సెమీ హైస్పీడ్ రైల్వేలైన్ కు గ్రీన్ సిగ్నల్..**

గుజరాత్లో సర్ఖేజీ - ధోలేరా మధ్య సెమీ హైస్పీడ్ డబుల్ రైల్వేలైన్ నిర్మాణానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుకు రూ.20,065 కోట్ల వ్యయాన్ని కేటాయించింది.

మహారాష్ట్రలోని నాగపూర్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఆధునికీకరించేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది.

ఈ నిర్ణయాలతో వ్యవసాయం, రైల్వేలు, ఇంధన రంగం, విమానయాన రంగాలకు భారీ ప్రోత్సాహం లభించనుంది. దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో ఈ ప్రాజెక్టులు కీలక పాత్ర పోషిస్తాయని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది.

### క్వాంటం కంప్యూటింగ్కు

## చిరునామాగా అమరావతి: సీఎం



(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. డిసెంబర్ నాటికి దేశానికి క్వాంటం కంప్యూటింగ్కు చిరునామాగా అమరావతి అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. రెండేళ్లలో అమరావతి నుంచి ప్రపంచానికి క్వాంటం కంప్యూటర్లు అందించబోతున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు.ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీ హరీశ్, మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు.

## నా కస్టోడియల్ టార్చర్ కేసును వదిలే ప్రసక్తే లేదు: రఘురామ

(మొదటి పేజీ తరువాయి)

వెళ్లిపోయారని రఘురామ విమర్శించారు. రెండో ముద్దాయిని, మూడో ముద్దాయిని ఇంకా విచారణకు ఎందుకు పిలవలేదని ప్రశ్నించారు. ఈ కేసులో జగన్ రెడ్డి, సునీల్ కుమార్ పేర్లు ఉన్నాయని అన్నారు. కూటమి ప్రభుత్వం పోలవరం పనులను శరవేగంగా పూర్తి చేస్తోందని తెలిపారు. 2027 జూన్లో పోలవరం పూర్తి అవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారని అన్నారు. పోలవరంతో పాటు తన కస్టోడియల్ టార్చర్ కేసును కూడా పూర్తి చేస్తారనే నమ్మకం తనకు ఉందని చెప్పుకొచ్చారు.జగన్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడే ఆయన చేసిన దారుణాల గురించి తాను మాట్లాడానని చెప్పుకొచ్చారు. రచ్చబండ ద్వారా జగన్ రెడ్డిని ఓడించే వరకు మాట్లాడానని తెలిపారు. ఎన్నికల్లో జగన్ దారుణంగా ఓడిపోయారని విమర్శించారు. ఇంకా జగన్ గురించి తాను మాట్లాడేది ఏముందని రఘురామ ప్రశ్నించారు.

## 15 శాతం వృద్ధితో పటిష్ఠ ఆర్థిక వ్యవస్థ: సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ఆర్థిక వృద్ధిని ప్రతీ నెలా... ప్రతీ జిల్లాలో, ప్రతీ మండలంలో ట్రాక్ చేయగలిగేలా వ్యవస్థను తీర్చిదిద్దాలని సీఎం స్పష్టం చేశారు. ఇందుకోసం జీఎస్డీపీ విధానాన్ని అర్థం చేసుకునేలా, అంచనాలు వేగంగా రూపొందించేలా అధికారులకు, ఉద్యోగులకు శిక్షణ ఇవ్వాలన్నారు. మొత్తం 5 జోన్లు, 28 జిల్లాలు, 175 నియోజకవర్గాలను కవర్ చేస్తూ మూడు నెలల పాటు కెపాసిటీ బిల్డింగ్ కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. రాష్ట్ర స్థాయి వర్క్షాప్లు, జోనల్-జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమాలు, నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్ల తయారీపై దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గం నుంచి ముగ్గురు అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. మరోవైపు వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగాల్లో ఏఐ ఆధారిత ఆర్థిక విశ్లేషణ వ్యవస్థలను అభివృద్ధి చేస్తున్నట్టు ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. ప్రస్తుతం ట్రాక్ చేయని సూచికలను గుర్తించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సూచించారు.

## ఆంధ్రప్రదేశ్ లో భారత్ నెట్ అమలుకు చారిత్రాత్మక ఒప్పందం

ఢిల్లీ, మే 13: ఆంధ్రప్రదేశ్ లో డిజిటల్ కనెక్టివిటీని మరింత విస్తరించే దిశగా కీలక ముందడుగు పడింది. భారత్ నెట్ అమలుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం, బీఎస్ఎన్ఎల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మధ్య చారిత్రాత్మక ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలకు హై-స్పీడ్ బాడ్‌బ్యాండ్ సేవలను విస్తరించేందుకు భారీ ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఆంధ్రప్రదేశ్ లో 'సవరించిన భారత్ నెట్ ప్రోగ్రామ్' అమలుకు కేంద్ర ప్రభుత్వం రూ.2,432 కోట్ల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేసింది. ఈ నిధులు డిజిటల్ భారత్ నిధి ద్వారా విడుదల కానున్నాయి. ఈ ప్రాజెక్టు అమలుతో రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలు వేగవంతం కావడంతో పాటు టెలికాం మౌలిక వసతులు మరింత బలోపేతం కానున్నాయి.కొత్త ఒప్పందం ప్రకారం ఆంధ్రప్రదేశ్లోని 13,426 గ్రామ పంచాయతీలకు హై-స్పీడ్ బాడ్ బ్యాండ్ కనెక్టివిటీ అందించనున్నారు. ఫైబర్ నెట్ నెట్వర్కు విస్తరించడం ద్వారా గ్రామీణ ప్రజలకు వేగవంతమైన ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ప్రత్యేకంగా విద్య, వైద్యం, వ్యవసాయం, ఈ-గవర్నెన్స్ సేవలు గ్రామీణ ప్రాంతాల్లో మరింత సులభంగా చేరేలా ఈ ప్రాజెక్టు ఉపయోగపడనుంది.రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లో ఉన్న 3,943 గ్రామాలకు 'ఆన్-డిమాండ్ కనెక్టివిటీ' సౌకర్యం కల్పించనున్నారు.

# తిరుపతి జిల్లా తయారీ రంగంలో రాష్ట్రంలోని ఇతర జిల్లాల కంటే చాలా ఉన్నత స్థాయిలో ఉంది

- **తిరుపతి జిల్లా తయారీ రంగంలో రాష్ట్రంలోని ప్రత్యేక స్థానం సంపాదించింది : కలెక్టర్ వెంకటేశ్వర్**




**తిరుపతి, మే 13మనం న్యూస్ :** తిరుపతి జిల్లా తయారీ రంగంలో రాష్ట్రంలోని ఇతర జిల్లాల కంటే చాలా ఉన్నత స్థాయిలో ఉందనీ రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు..బుధవారం స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు తిరుపతి ఎకానమిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళిక పై జిల్లాలోని ప్రధాన ప్రాజెక్టులపై రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, నగరపాలక సంస్థ ఇంచార్జి కమిషనర్ శారదా దేవి, డిఆర్ఓ నరసింహులు జిల్లా శాఖ అధికారులతో కలిసి సమీక్షించారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి మాట్లాడుతూ.. తిరుపతి జిల్లా తయారీ రంగంలో రాష్ట్రంలోని ఇతర జిల్లాల కంటే చాలా ఉన్నత స్థాయిలో ఉందనీ అన్నారు. ఇది మంచి సంకేతమని భవిష్యత్తులో మనం అభివృద్ధి చెందాలంటే వ్యవసాయం నుండి పరిశ్రమలు సేవా రంగానికి మారాలని అన్నారు. సేవా రంగాల వాటా ఎక్కువగా ఉండాలని అప్పుడే పెట్టుబడులు ఉపాధిగా మారి ఆర్థిక వృత్తిగా మారుతాయి అని ఆ సామర్థ్యం తిరుపతి జిల్లాకు ఉందన్నారు. ప్రస్తుతం జిల్లాలో తయారీ మౌలిక సదుపాయాలతో పాటు ఓడరేవు జాతీయరహదారుల, రాష్ట్ర రహదారులతో బలమైన నెట్వర్క్ అందుబాటులో ఉందన్నారు. పారిశ్రామిక హబ్ దిశగా జిల్లాను అభివృద్ధి చేయాలన్నారు. పరిశ్రమలు వచ్చినప్పుడు అవి కేవలం పారిశ్రామిక కార్యకలాపాలకు కేంద్రాలుగా మాత్రమే కాకుండా వాటికి సంబంధించిన నివాస, పట్టణ ప్రణాళిక మరియు సేవా రంగా ప్రణాళికలు కూడా ఇందులో అంతర్భాగం కావాలన్నారు. నిత్యం తిరుపతి, తిరుమల దర్శనానికి వేల సంఖ్యలో ప్రజలు నగరానికి వస్తుంటారని వారు కాసేపు సేద తీరేలా సమయం చేకూర్చే దిశగా ఆలోచన చేయాలన్నారు. జిల్లాలోని పరిశ్రమలను సద్వినియోగం చేసుకుంటూ అభివృద్ధి పథంలో జిల్లా నడపాలని జిల్లా యంత్రాంగానికి సూచించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి జిల్లా అభివృద్ధి పారిశ్రామిక విస్తరణ పట్టణీకరణ,భవిష్యత్తు మౌలిక సదుపాయాలలు, పారిశ్రామిక వృద్ధి విద్యాసంస్థలు ఆర్థిక పురోగతి గ్రేటర్ తిరుపతి కార్పొరేషన్ వంటి అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్ రాష్ట్ర పరిశ్రమలు వాణిజ్య శాఖ కార్యదర్శి కి తెలియజేశారు. జిల్లాలో సుమారు 30 వేల ఎకరాలకు పైగా పారిశ్రామిక భూభాగం క్రియాశీలకంగా ఉందని తెలిపారు, శ్రీ సిటీ, నాయుడుపేట ఈఎంసి క్లస్టర్లు ప్రాంతాలలో పరిశ్రమలు అభివృద్ధి చెందుతున్నాయి అన్నారు. వీటి అభివృద్ధికి భూసేకరణ ప్రక్రియ ప్రారంభమైందని అన్నారు. తిరుపతి జిల్లా తయారంగంలో రాష్ట్రంలో ప్రత్యేక స్థానం సంపాదించిందన్నారు, జిల్లా జిడిపిలో తయారీ రంగం వాటా 36% ఉందని అన్నారు. చెన్నై బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ వి సి ఐ సి జిల్లాలో పారిశ్రామిక పెట్టుబడులకు ప్రధాన కేంద్రాలుగా మారాయన్నారు. శ్రీకాళహస్తి పరిసర ప్రాంతాలలో కలంకారీ కళ, సాంప్రదాయ చెక్క కళాకృతులకు మంచి ప్రాచుర్యం ఉందని తెలిపారు. తిరుమల తో పాటు శ్రీకాళహస్తి తిరుచానూరు ఆలయాలకు భక్తులు వస్తున్నారని వారి సౌకర్యార్థము కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్ర సగటు తలసరి ఆదాయంతో పోలిస్తే తిరుపతి జిల్లా ముందంజలో ఉందన్నారు.

మల్లమడుగు రిజర్వాయర్ తిరుపతి, తిరుమల ప్రాంతాలకు త్రాగునీటిని అందించడంలో ఈ ప్రాజెక్ట్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు.

హెరిటేజ్ ఎకానమీ మరియు ఆర్టిసనల్ క్లస్టర్స్ భాగంగా గ్రామీణ జీవనోపాధిని పెంపొందించడానికి, స్థానిక కళలను కాపాడటానికి సాంస్కృతిక పర్యాటకాన్ని ప్రోత్సహించడంతోపాటు ఉపాధి కూడా కల్పించడం జరుగుతుందన్నారు. ఇంకా జిల్లాను అభివృద్ధి దిశగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అక్షరాధ్ర బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిద్దాం



**చిత్తూరు, మే,13 మనం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని వంద శాతం అక్షరాస్యత కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో విద్యాశాఖ ప్రతిష్టాత్మకంగా అక్షరాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర వయోజన విద్య సంచాలకులు పి రంజిత్ భాష, తెలిపారు. బుధవారం, మంగళగిరి నుండి ఉల్లాస అక్షరాంధ్ర కార్యక్రమం అమలపై వివిధ జిల్లాల వయోజన విద్య శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 15 నుండి 59 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి చదవడం, రాయడం తెలియని నిరక్షరాస్యులను గుర్తించి వారిని అక్షరాస్యులుగా మార్చడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ విద్యా హక్కు కల్పించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని విస్తృత స్థాయిలో అమలు చేస్తున్నట్లు తెలిపారు. అక్షరాంధ్రను కేవలం ఒక ప్రచార కార్యక్రమంగా కాకుండా, ప్రజలందరి భాగస్వామ్యంతో చేపట్టే బృహత్తర యజ్ఞంగా విద్యాశాఖ భావిస్తోందన్నారు. గ్రామ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు అధికారులు, ఉపాధ్యాయులు, వాలంటీర్లు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేసి నిరక్షరాస్యత నిర్మూలనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి కుటుంబంలో అక్షరాస్యత వెలుగు నింపి, రాష్ట్రాభివృద్ధికి ప్రజలందరూ భాగస్వాములు కావాలని తెలిపారు, ఈ కార్యక్రమానికి పాత కలెక్టరేట్లోని గిరింపేట్లో ఉన్న వయోజన విద్య కార్యాలయము నందు వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి వయోజన విద్యాశాఖ ఉపసంచాలకులు మహమ్మద్ ఆజాద్ , గణాంక సహాయకురాలు సంగీత, పర్యవేక్షకులు కందేశ్వర రావు . ఈ సందర్భంగా చిత్తూరు జిల్లా వయోజన విద్య డిడి మహమ్మద్ ఆజాద్ మాట్లాడుతూ ఉల్లాస అక్షరాంధ్ర కార్యక్రమం అమలులో భాగంగా చిత్తూరు జిల్లాలో 60,000 మందిని అక్షరాస్యులుగా చేయాలని లక్ష్యాన్ని ముందుకు సాగుతున్నామని తెలిపారు, డిఆర్డిఏ, మెప్మా, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖల సమన్వయాౕతో కార్యక్రమాల అమలు చేయుచున్నామని వివరించారు.

# పర్యాటక రంగం మరింత అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు

- **తిరుపతిలో రూ. 1,000 కోట్లతో ఐకానిక్ పర్యాటక కేంద్రాల అభివృద్ధి**
- **తిరుపతిలో 'రిజెంటా దేవరాయ' ఫోర్ స్టార్ హోటల్ ప్రారంభోత్సవంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్**
- **రాష్ట్రంలో పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పిస్తున్న ప్రభుత్వం: జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్**



**తిరుపతి, మే 13 మన న్యూస్:** రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపడుతోందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. బుధవారం తిరుపతిలో నూతనంగా ఏర్పాటు చేసిన 'రిజెంటా దేవరాయ' ఫోర్ స్టార్ హోటల్ను తిరుపతి శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు,తిరుమల టి.టి.డి బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి లతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా పర్యాటక శాఖ కందుల దుర్గేష్ మంత్రి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్లో టెంపుల్ టూరిజం ప్రధాన భూమిక పోషిస్తోందని, కేవలం ఇక్కడికి వచ్చే యాత్రికులు దర్శనాలకే పరిమితం కాకుండా రెండు మూడు రోజులు ఇక్కడే బస చేసి ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించేలా సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. గత 24 నెలల కాలంలో పర్యాటక రంగంలో సుమారు రూ. 20 వేల కోట్ల పెట్టుబడులకు సంబంధించి ఎంఓయులు కుదుర్చుకున్నట్లు వెల్లడించారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించామని, దీని ద్వారా కొత్త పెట్టుబడిదారులకు ఎస్జీఎస్టీ రీయింబర్స్మెంట్, పరిశ్రమలతో సమానంగా విద్యుత్ టారిఫ్ వంటి రాయితీలు అందిస్తున్నామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో తిరుపతి మరియు విశాఖపట్నంలను 'ఐకానిక్ పర్యాటక కేంద్రాలు'గా అభివృద్ధి చేయబోతున్నామని, ఇందుకోసం ఒక్కో కేంద్రానికి రూ. 500 కోట్ల చొప్పున మొత్తం రూ. 1,000 కోట్లు వెచ్చించనున్నట్లు మంత్రి వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో 2029 నాటికి రాష్ట్రవ్యాప్తంగా 50 వేల హోటల్ గదులుఅందుబాటులోకితీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ప్రతి నెలా కనీసం రెండు కొత్త హోటల్స్ వచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. ప్రైవేట్ రంగంలో వస్తున్న ఇలాంటి హోటల్స్ పర్యాటకుల అవసరాలను తీర్చడమే కాకుండా, రాష్ట్ర పర్యాటక ముఖచిత్రాన్ని మారుస్తాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ మాట్లాడుతూ... తిరుపతిని అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గత రెండు సంవత్సరాలలో తిరుపతిలో హాస్పిటాలిటీ రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ప్రముఖ హోటల్ బ్రాండ్లు తిరుపతిలో కార్యకలాపాలు ప్రారంభించడం నగర అభివృద్ధికి నిదర్శనమన్నారు. 'రిజెంటా బై దేవరాయ' హోటల్ 56 గదులతో ప్రారంభం కావడం తిరుపతి పర్యాటక రంగంలో మరో మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రాంతం మొత్తం ఫోర్ స్టార్, ఫైవ్ స్టార్ హోటళ్లకు అనుకూలమైన ఎకోసిస్టమ్గా రూపుదిద్దుకుంటోందన్నారు. భక్తుల బస వ్యవధిని రెండు రోజుల వరకు పెంచడం ప్రభుత్వ లక్ష్యమన్నారు. తిరుమలలో గదుల విస్తరణకు పరిమితులు ఉన్న నేపథ్యంలో, తిరుపతిలో త్రీ స్టార్, ఫోర్ స్టార్, ఫైవ్ స్టార్ హోటల్ గదుల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. పర్యాటక రంగాన్ని పరిశ్రమల విభాగంగా గుర్తిస్తూ ప్రత్యేక ప్రోత్సాహకాలు, సబ్సిడీలు, విధానాలు అమలు చేస్తున్నామని తెలిపారు. త్వరలో దామినేడులో 21 ఎకరాల విస్తీర్ణంలో భారీ కన్వెన్షన్ కమ్ హోటల్ కాంప్లెక్స్ ఏర్పాటు కానుందని వెల్లడించారు. అదేవిధంగా తదితర అంతర్జాతీయ హోటల్ బ్రాండ్లు కూడా తిరుపతిలో పెట్టుబడులకు ముందుకు వస్తున్నాయని తెలిపారు. తిరుపతిలో పర్యాటక రంగానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని, డిమాండ్కు అనుగుణంగా హోటల్ రంగంలో పెట్టుబడులు పెట్టాలని హోటలియర్లను ఆయన ఆహ్వానించారు. పెట్టుబడిదారులకు భద్రత, పరిపాలనా సహకారం అందించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. తిరుపతి శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ.... తిరుపతిని ఆధ్యాత్మిక కేంద్రంగానే కాకుండా అంతర్జాతీయ స్థాయి పర్యాటక నగరంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. భక్తులు తిరుమల దర్శనంతో పాటు తిరుపతిలో రెండు మూడు రోజులు గడిపేలా ఆధునిక వసతి, వినోద, కన్వెన్షన్ సదుపాయాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం తీసుకొస్తున్న పర్యాటక అనుకూల విధానాల వల్ల ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ హోటల్ సంస్థలు తిరుపతిలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తుండటం ఆనందదాయకమని పేర్కొన్నారు. 'రీజెంటా బై దేవరాయ' వంటి నూతన ఫోర్ స్టార్ హోటల్స్ పర్యాటకులకు నాణ్యమైన సేవలు అందించడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తాయని అన్నారు.పర్యాటక రంగ అభివృద్ధి ద్వారా స్థానిక వ్యాపారాలు, రవాణా, హస్తకళలు సేవారంగం మరింత బలోపేతం అవుతాయని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టితో తిరుపతి దేశంలోనే అత్యుత్తమ టెంపుల్ టూరిజం డెస్టినేషన్గా అవతరించబోతోందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్ కొట్టే సాయి, టూరిజం ఆర్ డి రమణమూర్తి హోటల్ యాజమాన్య ప్రతినిధులు, ఇతర ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలలో మహిళలు, చిన్నారుల భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు.



**తిరుపతి మే13 మనం న్యూస్:** తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ అధికారులు కాగితాల గ్రామాన్ని సందర్శించి ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల నివారణ, మహిళల భద్రత, చిన్నారుల రక్షణకు సంబంధించిన అంశాలపై ప్రజలకు వివరించారు. అలాగే సైబర్ నేరాలు, ఆన్లైన్ మోసాలు, తెలియని లింకులు ఓపెన్ చేయడం వల్ల కలిగే నష్టాలు,ఓటిపి మోసాలు, డిజిటల్ అరెస్ట్ స్కాములు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనుమానాస్పద ఫోన్ కాల్స్, మెసేజ్లకు స్పందించకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.ఈ సందర్భంగా గంజాయి వినియోగం వల్ల యువత భవిష్యత్తుపై పడే దుష్ప్రభావాలు, చైన్ స్నాచింగ్ ఘటనల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి కూడా వివరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, హెల్మెట్ ధరించడం, అతివేగంగా వాహనాలు నడపకపోవడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయకూడదని ప్రజలకు సూచించారు. గ్రామ ప్రజలు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పోలీసుల సూచనలను ఆసక్తిగా విన్నారు. అత్యవసర సమయంలో డైల్ 112 కి సమాచారం అందిస్తే తక్షణ చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

# గ్రోయర్అసోసియేషన్ మొక్కలకు ఆదరణ, సమన్వయంతో నర్సరీ గ్రోయర్స్ కు అండగా ఉంటాం




**చంద్రగిరి మే 13 మనం న్యూస్:** పరస్పర సహకారంతో ముందుకు సాగుదాం. సమన్వయంతో అవకాశాలు అందిపుచ్చు కొందాం. ఆంధ్రప్రదేశ్ నర్సరీ గ్రోయర్ అసోసియేషన్ రాష్ట్ర సర్వసభ్య సమావేశం శ్రీనివాస మంగా పురంలో గోపాలం రవీంద్ర అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పలువురు అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం నర్సరీ గ్రోయర్స్ కు సహాయం అందించాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ముఖ్యంగా నీరు, విద్యుత్తు, అధిక ధరలు, మార్కెటింగ్ లాంటి సమస్యలతో పాటు వాతావరణ ప్రతికూలత, ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయే వారిని ఆదుకోవాలని అన్నారు. అసోసియేషన్ కంపెనీ చట్టాల పరిధిలో మొక్కల పెంపకం, అమ్మకాలు పెంచడానికి ప్రయత్నిస్తామన్నారు. నర్సరీ మొక్కలకు మంచి అవకాశాలు ఉన్నాయని. దీంతోపాటు నర్సరీలో ఆర్గానిక్ ఉత్పత్తులను అమ్మకాలు ద్వారా ఆర్థికంగా ఊతం ఉంటుందన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అసోసియేషన్ అందిస్తుందని, మనిషికి మొక్కలకు అభినవభావ సంబంధం ఉంటుందని అన్నారు. సంఘం స్ఫూర్తితో పరిచయాలతో ఒకరికొకరు సహాయం చేసుకోవడమే ప్రామాణికంగా ఉండాలన్నారు. అంతరించిపోతున్న అరుదైన మొక్కలను, ఔషధ గుణాలు కలిగిన మొక్కలను ఆదరించి ప్రజలకు అందుబాటులో తక్కువ ధరలకు అందించడం లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. అసోసియేషన్ నూతన అధ్యక్షుడుగా ఆకుల చలపతిరావు , ఉపాధ్యక్షులుగా సరిత విజయవాడ ,ప్రధాన కార్యదర్శిగా నరసింహారెడ్డి దర్శి ,సహాయ కార్యదర్శులుగా చాంతాటి రమేష్ శ్రీకాకుళం, బండి అన్న రవి అంగళ్లు , కోశాధికారిగా మన్నే శ్రీనివాసరావు విజయవాడ ,సమన్వయకర్తగా లక్ష్మీనారాయణ బాపట్ల, పౌరు సంబంధాల అధికారిక రాజ్ కుమార్ విజయవాడ ,కార్యవర్గ సభ్యులుగా రంగస్వామి పాణ్యం,, కృష్ణమూర్తిజంగారెడ్డిగూడెం, ఆకివీడు ప్రసాద్, ఆకుల మునిరత్నం తిరుపతి, కాకినాడ వి ప్రసాద్, గుంటూరు ఉమా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు డాక్టర్ యం . ఆర్.యన్. వర్మ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలలో నర్సరీ అసోసియేషన్ అందుపుచ్చుకుని ప్రజలకు తక్కువ ధరలో మొక్కలు అందించాలని, సంగం ఐక్యతే ముఖ్యమని అన్నారు. ఈ కార్యక్రమం లో నర్సరీ గ్రోయర్స్ అసోసియేషన్ స్థానిక నాయకులు హరికృష్ణ, కోటేశ్వరరావు, బాలరావి, మునిరత్నం, ముని శాఖర్, రేణుక తదితరులు పాల్గొన్నారు.

# శ్రీపద్మావతీ చిన్నపిల్లల ఆసుపత్రి నూతన భవన నిర్మాణ పనులు జూలై 31లోపు పూర్తి చేయాలి :



**తిరుపతి మే13మనం న్యూస్:** తిరుపతిలో నిర్మాణంలో ఉన్న శ్రీపద్మావతీ చిన్నపిల్లల ఆసుపత్రి నూతన భవన నిర్మాణ పనులను టిటిడి ఈవో శ్రీ ఎం. రవిచంద్ర ఆదేశాల మేరకు ఈ ఏడాది జూలై 31వ తేదీ లోపు పూర్తి చేయాలని టిటిడి జేఈవో (వైద్యం విద్య) డా. ఎ. శరత్ అధికారులను ఆదేశించారు. టిటిడి ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఆయన నిర్మాణ పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జేఈవో డా. ఎ. శరత్ మాట్లాడుతూ, చిన్నారులకు అత్యాధునిక వైద్య సేవలు అందించే లక్ష్యంతో నిర్మిస్తున్న ఈ నూతన ఆసుపత్రి భవనాన్ని ప్రణాళికాబద్ధంగా, నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు. ప్రతి అంతస్తులో ఏర్పాటు చేయనున్న విభాగాలు, గదులు, వైద్య సదుపాయాలు, మౌళిక వసతులు తదితర అంశాలను స్పష్టంగా ప్రతిబింబించేలా నివేదిక సిద్ధం చేయాలన్నారు.తదుపరి శాఖల వారీగా కొనసాగుతున్న అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించిన జేఈవో, ఇంజనీరింగ్ పనుల్లో ఎలాంటి అలసత్వం ప్రదర్శించరాదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి డైరెక్టర్ డా. ఎన్. శ్రీనాథ్ రెడ్డి, ఎస్.ఈలు వేంకటేశ్వర్లు, మనోహరం, ఈఈ సుమతి, డిప్యూటీ ఈఈ హర్షవర్ధన్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# తిరుపతిని 'గ్లోబల్ టూరిస్ట్ హబ్'గా తీర్చిదిద్దుతాం: పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్

- **చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, శ్రీపొట్టిశ్రీరాములు జిల్లలా పర్యాటక ప్రాజెక్టులపై అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష.**



**తిరుపతి, మే 13 మనం న్యూస్:** ఆధ్యాత్మిక నగరం తిరుపతిని అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన 'ఐకానిక్ గ్లోబల్ టూరిస్ట్ హబ్'గా మార్చడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి వర్యులు కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. మంగళవారం తిరుపతిలోని గ్రాండ్ రిడ్జ్ హోటల్లో జిల్లా పర్యాటక శాఖ అధికారులతో మంత్రి కందుల దుర్గేష్ సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి పరిసర ప్రాంతాలను కలుపుతూ ప్రత్యేక పర్యాటక సర్క్యూట్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించిన మంత్రి దుర్గేష్ పెండింగ్లో ఉన్న ప్రతిపాదనలను త్వరితగతిన పట్టాలెక్కించాలని సూచించారు. రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని బలోపేతం చేసేందుకు ఇన్వెస్టర్లకు అవసరమైన భూములను కేటాయించడం, ఇప్పటికే కుదుర్చుకున్న ఎంవోయూల అమలుపై ప్రత్యేక దష్టి సారించాలన్నారు. ల్యాండ్ బ్యాంక్ వివరాలు, ఎగ్జిస్టింగ్ ప్రాపర్టీస్ మరియు కోర్టు కేసుల స్థితిగతులపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, శ్రీపొట్టిశ్రీరాములు జిల్లాల పర్యాటక ప్రణాళికలను వివరించారు. కేవలం ఆధ్యాత్మికమే కాకుండా అన్నమయ్య జిల్లాను పర్యాటక రంగం ద్వారా ఆర్థికంగా ఎలా బలోపేతం చేయాలనే 'ఎకనామిక్ మోడల్' పై చర్చించి దిశానిర్దేశం చేశారు. హార్సిలీహిల్స్ ఫెస్టివల్ నిర్వహణకు చర్యలు తీసుకుంటామన్నారు. విశాలమైన తీర ప్రాంతం ఉన్న శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరులో అంతర్జాతీయ స్థాయి స్టార్ హోటళ్లు, రిసార్టులు వచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మైపాడు బీచ్ ఫెస్టివల్ ను జూలైలో నిర్వహిద్దామని తెలిపారు. మైపాడు బీచ్ కు బ్లూఫ్లాగ్ గుర్తింపు వచ్చేందుకు చర్యలు తీసుకుంటామని, ఈ క్రమంలో బీచ్ లో పర్యాటకుల భద్రత, పరిశుభ్రతకు పెద్దపీట వేయాలన్నారు. త్వరలోనే సంబంధిత అధికారులు వచ్చి తనిఖీ చేస్తారని తెలిపారు. పర్యాటక రంగంలో జవాబుదారీతనం పెంచేందుకు ఇకపై ప్రతి మూడు నెలలకోసారి రివ్యూ సమావేశాలు నిర్వహిస్తామని మంత్రి దుర్గేష్ ప్రకటించారు. క్షేత్రస్థాయి సమస్యలను పరిష్కరించడంతో పాటు, ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ నిబంధనలు ఉల్లంఘించే వారికి తక్షణమే నోటీసులు జారీ చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యాటక కళను చాటేలా అన్ని జిల్లాల్లో క్రమం తప్పకుండా పర్యాటక ఉత్సవాలు, ఫెస్టివల్స్ నిర్వహించాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర పర్యాటక అభివద్ధిలో భాగంగా కేంద్ర ప్రభుత్వం కేటాయించిన ప్రాజెక్టుల ప్రస్తుత స్థితిగతులు,వాటిని గడువులోగా పూర్తి చేయడంపై చర్చించారు.పర్యాటకులు స్థానిక సంస్కృతిని ఆస్వాదించేలా 'హోమ్ స్టే' మరియు 'బెడ్ అండ్ బ్రేక్ ఫాస్ట్' వ్యవస్థను ప్రోత్సహించడం ద్వారా స్థానికులకు ఉపాధి కల్పించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్ డా. రమణ ప్రసాద్, డివిజనల్ మేనేజర్లు శ్రీనివాసరావు (తిరుపతి), జయదేవ్ (నెల్లూరు), జిల్లా పర్యాటక అధికారులు జనార్ధన్ రెడ్డి (తిరుపతి), నరేంద్ర (చిత్తూరు), నాగభూషణం (అన్నమయ్య), ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుబ్రహ్మణ్యం రాజు, ఆయా జిల్లాల యూనిట్ మేనేజర్లు, ప్రజా సంబంధాల అధికారి రవీంద్రారెడ్డి, వివిధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు. తిరుపతిని 'గ్లోబల్ టూరిస్ట్ హబ్'గా తీర్చిదిద్దుతాం: పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, శ్రీపొట్టిశ్రీరాములు జిల్లలా పర్యాటక ప్రాజెక్టులపై అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష. హార్సిలీహిల్స్ ఫెస్టివల్ నిర్వహణకు చర్యలు..జూలైలో మైపాడు బీచ్ ఫెస్టివల్ ను నిర్వహించాలని ఆదేశాలు జారీ.. మైపాడు బీచ్ కు బ్లూఫ్లాగ్ గుర్తింపు వచ్చేందుకు కషి చేస్తామని వెల్లడి.

తిరుపతి, మే 13 మనం న్యూస్: ఆధ్యాత్మిక నగరం తిరుపతిని అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన 'ఐకానిక్ గ్లోబల్ టూరిస్ట్ హబ్'గా మార్చడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి వర్యులు కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. మంగళవారం తిరుపతిలోని గ్రాండ్ రిడ్జ్ హోటల్లో జిల్లా పర్యాటక శాఖ అధికారులతో మంత్రి కందుల దుర్గేష్ సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి పరిసర ప్రాంతాలను కలుపుతూ ప్రత్యేక పర్యాటక సర్క్యూట్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించిన మంత్రి దుర్గేష్ పెండింగ్లో ఉన్న ప్రతిపాదనలను త్వరితగతిన పట్టాలెక్కించాలని సూచించారు. రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని బలోపేతం చేసేందుకు ఇన్వెస్టర్లకు అవసరమైన భూములను కేటాయించడం, ఇప్పటికే కుదుర్చుకున్న ఎంవోయూల అమలుపై ప్రత్యేక దష్టి సారించాలన్నారు. ల్యాండ్ బ్యాంక్ వివరాలు, ఎగ్జిస్టింగ్ ప్రాపర్టీస్ మరియు కోర్టు కేసుల స్థితిగతులపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, శ్రీపొట్టిశ్రీరాములు జిల్లాల పర్యాటక ప్రణాళికలను వివరించారు. కేవలం ఆధ్యాత్మికమే కాకుండా అన్నమయ్య జిల్లాను పర్యాటక రంగం ద్వారా ఆర్థికంగా ఎలా బలోపేతం చేయాలనే 'ఎకనామిక్ మోడల్' పై చర్చించి దిశానిర్దేశం చేశారు. హార్సిలీహిల్స్ ఫెస్టివల్ నిర్వహణకు చర్యలు తీసుకుంటామన్నారు. విశాలమైన తీర ప్రాంతం ఉన్న శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరులో అంతర్జాతీయ స్థాయి స్టార్ హోటళ్లు, రిసార్టులు వచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మైపాడు బీచ్ ఫెస్టివల్ ను జూలైలో నిర్వహిద్దామని తెలిపారు. మైపాడు బీచ్ కు బ్లూఫ్లాగ్ గుర్తింపు వచ్చేందుకు చర్యలు తీసుకుంటామని, ఈ క్రమంలో బీచ్ లో పర్యాటకుల భద్రత, పరిశుభ్రతకు పెద్దపీట వేయాలన్నారు. త్వరలోనే సంబంధిత అధికారులు వచ్చి తనిఖీ చేస్తారని తెలిపారు. పర్యాటక రంగంలో జవాబుదారీతనం పెంచేందుకు ఇకపై ప్రతి మూడు నెలలకోసారి రివ్యూ సమావేశాలు నిర్వహిస్తామని మంత్రి దుర్గేష్ ప్రకటించారు. క్షేత్రస్థాయి సమస్యలను పరిష్కరించడంతో పాటు, ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ నిబంధనలు ఉల్లంఘించే వారికి తక్షణమే నోటీసులు జారీ చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యాటక కళను చాటేలా అన్ని జిల్లాల్లో క్రమం తప్పకుండా పర్యాటక ఉత్సవాలు, ఫెస్టివల్స్ నిర్వహించాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర పర్యాటక అభివద్ధిలో భాగంగా కేంద్ర ప్రభుత్వం కేటాయించిన ప్రాజెక్టుల ప్రస్తుత స్థితిగతులు,వాటిని గడువులోగా పూర్తి చేయడంపై చర్చించారు.పర్యాటకులు స్థానిక సంస్కృతిని ఆస్వాదించేలా 'హోమ్ స్టే' మరియు 'బెడ్ అండ్ బ్రేక్ ఫాస్ట్' వ్యవస్థను ప్రోత్సహించడం ద్వారా స్థానికులకు ఉపాధి కల్పించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్ డా. రమణ ప్రసాద్, డివిజనల్ మేనేజర్లు శ్రీనివాసరావు (తిరుపతి), జయదేవ్ (నెల్లూరు), జిల్లా పర్యాటక అధికారులు జనార్ధన్ రెడ్డి (తిరుపతి), నరేంద్ర (చిత్తూరు), నాగభూషణం (అన్నమయ్య), ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుబ్రహ్మణ్యం రాజు, ఆయా జిల్లాల యూనిట్ మేనేజర్లు, ప్రజా సంబంధాల అధికారి రవీంద్రారెడ్డి, వివిధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్తో భక్తులకు వేగవంతంగా శ్రీవారి దర్శనం

- **డిజిటల్ మానిటరింగ్తో రద్దీ భారీగా ఉన్నా భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం**



**తిరుమల మే13 మనం న్యూస్:** వేసవి సెలవుల నేపథ్యంలో తిరుమలలో భక్తుల రద్దీ భారీగా పెరుగుతున్నప్పటికీ టీటీడీ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ భక్తులకు వేగవంతమైన, సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు సమర్థవంతమైన చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ కీలకపాత్ర పోషిస్తోంది.తిరుమలలోని క్యూ కాంప్లెక్స్లు, నారాయణగిరి షెడ్లు, అన్నప్రసాద కేంద్రాలు, ప్రధాన రహదారులు, పార్కింగ్ ప్రాంతాలు, ఆలయ పరిసరాలు తదితర ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితులను ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. వందల సంఖ్యలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా భక్తుల కదలికలు, రద్దీ తీవ్రత, క్యూ లైన్ల ప్రవాహం వంటి అంశాలను ఎప్పటికప్పుడు విశ్లేషిస్తూ తక్షణ నిర్ణయాలు తీసుకుంటున్నారు. భక్తులు ఏ ప్రాంతంలో ఎక్కువసేపు వేచి ఉండకుండా క్యూ లైన్లను సమతుల్యం చేయడం, అవసరమైన చోట అదనపు సిబ్బందిని నియమించడం, తాగునీరు, పాలు, అన్నప్రసాదం, వైద్య సేవలు వేగంగా అందించడం వంటి చర్యలు సమన్వయంతోకొనసాగుతున్నాయి. దీంతో దర్శన సమయ నియంత్రణలో గణనీయమైన మెరుగుదల కనిపిస్తోంది.ప్రత్యేకించినారాయణగిరి షెడ్లు, వైకుంఠం క్యూ కాంప్లెక్సుల్లో భక్తుల రద్దీని డిజిటల్ మానిటరింగ్ ద్వారా అంచనా వేసి, దానికి అనుగుణంగా భక్తులను విడతల వారీగా ముందుకు పంపించే విధానాన్ని అమలు చేస్తున్నారు. టీటీడీఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా వినియోగిస్తూ భక్తులకు సౌకర్యవంతమైన, వేగవంతమైన దర్శనం కల్పించడమే లక్ష్యంగా టీటీడీ అధికారులు 24 గంటలూ అప్రమత్తంగా పనిచేస్తున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తాగునీరు, పరిశుభ్రత, వైద్య సేవలు, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలపై టీటీడీ ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు భక్తుల సహకారంతో తిరుమలలో దర్శన వ్యవస్థ మరింత సాఫీగా కొనసాగుతోంది.ప్రస్తుతం వేసవి రద్దీ నేపథ్యంలో శని, ఆదివారాల్లో దాదాపు 85 వేలమందికి పైగా భక్తులకు దర్శనం చేయించడం జరుగుతోంది. అదేవిధంగా సాధారణ రోజుల్లో దాదాపు 75వేల మంది భక్తులకు పైగా దర్శనం చేసుకునేందుకు టీటీడీ యంత్రాంగం విశేషంగా కృషి చేస్తోంది. మే 2వ తేదిన అత్యధికంగా 91,005 మంది భక్తులు స్వామివారిని దర్శించుకోవడం విశేషం.

# ఉత్పత్తి అనుసంధాన ప్రోత్సాహంతో భారత్ బలోపేతం



2020లో భారత ప్రభుత్వం ప్రారంభించిన ఉత్పత్తి అనుసంధాన ప్రోత్సాహక పథకం (PLI Scheme) దేశీయ తయారీ రంగాన్ని బలోపేతం చేయడం, దిగుమతులపై ఆధారాన్ని తగ్గించడం భారతదేశాన్ని ప్రపంచ స్థాయి తయారీ కేంద్రంగా మార్చడం లక్ష్యంగా పెట్టుకుంది. ఆత్మనిర్భర్ భారత్ దృష్టితో ఈ పథకం పెట్టుబడులు, ఎగుమతులు, ఉపాధి సృష్టి, సాంకేతిక అభివృద్ధిని ప్రోత్సహిస్తోంది. భారత ప్రభుత్వం స్వయం సమృద్ధిని ప్రోత్సహించడం కోసం ఎలక్ట్రానిక్స్, ఔషధాలు, ఆటోమొబైల్లు, వస్త్రాలు, టెలికాం, సౌరశక్తి వంటి 14 ముఖ్య రంగాల కోసం ప్రభుత్వం సుమారు 1.97 లక్షల కోట్లను కేటాయించింది. ఈ పథకం 2 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించి 18.7 లక్షల కోట్లకు పైగా అదనపు ఉత్పత్తి విలువను సృష్టించింది.

అధిక పారిశ్రామిక ఉత్పత్తి ద్వారా భారతదేశ తయారీ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచి స్థూల దేశీయ ఉత్పత్తి వృద్ధికి ఇది దోహద పడింది. దేశవ్యాప్తంగా ప్రత్యక్ష మరియు పరోక్షంగా 12.6 లక్షలకు పైగా ఉద్యోగాలు సృష్టించబడ్డాయి. ఆపిల్, శామ్‌సంగ్ వంటి కంపెనీలు భారతదేశంలో ఉత్పత్తిని విస్తరించడంతో భారత్ ప్రపంచంలోని ప్రముఖ స్మార్ట్‌ఫోన్ తయారీ కేంద్రాలలో ఒకటిగా మారింది. మొబైల్ ఫోన్ ఎగుమతులు 1.5 లక్షల కోట్లను దాటడంతో విదేశీ మారక ఆదాయం గణనీయంగా పెరిగింది. PLI పథకం కింద మొత్తం ఎగుమతులు 8 లక్షల కోట్లను మించి, భారతదేశ వాణిజ్య పనితీరును మెరుగుపరిచాయి. ఔషధ రంగంలో భారత్ బల్క్ డ్రగ్స్ దేశీయ ఉత్పత్తిని పెంచి దిగుమతులపై ఆధారాన్ని తగ్గించింది. ఆటోమొబైల్ PLI పథకం ఎలక్ట్రిక్ వాహనాల తయారీని, అధునాతన సాంకేతిక ఉత్పత్తిని ప్రోత్సహించింది. టెలికాం పరికరాల తయారీ కూడా పెరిగి విదేశీ దిగుమతులు తగ్గించ డానికి సహాయపడింది. వివిధ రాష్ట్రాల్లో 1,300కి పైగా తయారీ యూనిట్లు స్థాపించబడి ప్రాంతీయ పారిశ్రామిక అభివృద్ధిని ప్రోత్సహించాయి. ఈ పథకం స్థానిక సరఫరాదారులు, అనుబంధ పరిశ్రమలకు అవకాశాలు కల్పించి చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (MSME) మద్దతు ఇచ్చింది. స్థానిక ఉత్పత్తి, ఆవిష్కరణ, ఎగుమతులు, ఉపాధిని ప్రోత్స హించడం ద్వారా ఈ పథకం భారత ఆర్థిక వృద్ధిని బలోపేతం చేసి దేశాన్ని ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యానికి మరింత దగ్గర చేసింది.

ఈ పథకం పరిధిలోని 14 రంగాలలో, ఎలక్ట్రానిక్స్ రంగం అత్యుత్తమ ఫలితాలు చూపింది, ముఖ్యంగా మొబైల్ ఫోన్ తయారీలో. భారత్ ప్రపంచంలో రెండవ అతిపెద్ద మొబైల్ ఫోన్ తయారీ దేశంగా మారింది, 2024-25లో ఎగుమతులు1.5 లక్షల కోట్లను దాటాయి. ఆపిల్ మరియు శామ్‌సంగ్ వంటి కంపెనీలు భారతదేశంలో తమ ఉత్పత్తిని గణనీయంగా విస్తరించాయి. ఔషధ రంగం కూడా బల్క్ డ్రగ్స్ , వైద్య పరికరాల దేశీయ ఉత్పత్తిని పెంచి, దిగుమతులపై ఆధారాన్ని తగ్గించడం ద్వారా మంచి విజయాలు చూపింది. ఆటోమొబైల్, ఆటో భాగాల రంగం ఎలక్ట్రిక్ వాహనాల తయారీ, ఆధునిక ఆటోమోటివ్ సాంకేతికత పెట్టుబడుల పెరుగుదల కారణంగా వేగంగా అభివృద్ధి




చెందింది. టెలికాం రంగం దేశీయంగా టెలికాం పరికరాల ఉత్పత్తిలో విజయాన్ని సాధించి, భారత్ దిగుమతులను తగ్గించడంలో, డిజిటల్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడంలో సహాయపడింది. ఫుడ్ ప్రాసెసింగ్ రంగం ప్రాసెస్డ్ ఆహార పదార్థాల ఎగుమతులను పెంచి గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధిని సృష్టించింది. వస్త్ర రంగం, ముఖ్యంగా టెక్నికల్ టెక్స్‌టైల్స్, కొత్త పెట్టుబడులను ఆకర్షించి ఎగుమతి పోటీతత్వాన్ని మెరుగుపరిచింది. సౌర ప్యానెల్ (PV) మాడ్యూల్ తయారీ కూడా ఈ పథకం కింద వేగంగా విస్తరించి పునరుత్పాదక శక్తి లక్ష్యాలకు తోడ్పడుతున్నాయి.

ఉత్పత్తి అనుసంధాన ప్రోత్సాహక పథకం (PLI) పథకం గణనీయమైన విజయాన్ని సాధించినప్పటికీ, ఇది అనేక ప్రధాన సవాళ్లను కూడా ఎదుర్కొంటోంది. ముఖ్యమైన సవాళ్లలో ఒకటి అనేక రంగాల్లో అమలులో, ప్రాజెక్ట్ అనుమతుల్లో జాప్యం. సౌర తయారీ రంగంలో, 2025 నాటికి లక్ష్యంగా పెట్టిన 65 గిగావాట్ (GW) సామర్థ్యంలో కేవలం సుమారు 31 ఎగి మాత్రమే అమలులోకి వచ్చింది. సెమీకండక్టర్లు, సౌర ప్యానెల్ (PV), అధునాతన బ్యాటరీల వంటి రంగాల్లో అధిక మూలధన పెట్టుబడి అవసరాలు మరో సమస్యగా ఉన్నాయి. అనేక సంస్థలు ప్రోత్సాహకాలు పొందడానికి అవసరమైన కఠినమైన డొమెస్టిక్ వాల్యూ అడిషన్ నిబంధనలను పాటించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఆటోమొబైల్ ప్రోత్సాహక పథకంలో, స్థానికీకరణ అవసరాల కారణంగా 84 అర్హత కలిగిన కంపెనీలలో కేవలం 16 కంపెనీలు మాత్రమే ప్రోత్సాహకాలకు అర్హత సాధించాయి. ఎలక్ట్రానిక్స్, సౌర తయారీ వంటి రంగాల్లో ముడి పదార్థాలు మరియు భాగాల కోసం, ముఖ్యంగా చైనా మీద దిగుమతి ఆధారితత కొనసాగుతోంది. తరచుగా మారే విధానాలు, వాణిజ్య విధాన అనిశ్చితి పెట్టుబడిదారుల విశ్వాసాన్ని కూడా ప్రభావితం చేస్తున్నాయి. సౌర ప్రోత్సాహక పథకం 2025 మధ్య నాటికి తన పాలిసిలికాన్ సామర్థ్య లక్ష్యంలో కేవలం 14% మాత్రమే సాధించింది, ఇది అప్‌స్ట్రీమ్ తయారీ వృద్ధి బలహీనంగా ఉందని సూచిస్తుంది.

భూమి సేకరణ జాప్యాలు, లాజిస్టిక్స్ ఖర్చులు, తగిన విద్యుత్ సరఫరా లేకపోవడం వంటి మౌలిక సదుపాయ సమస్యలు పారిశ్రామిక విస్తరణను నెమ్మదించిస్తున్నాయి. కొన్ని నిపుణులు కొన్ని రంగాల్లో ఉద్యోగాల సృష్టి అంచనాల కంటే తక్కువగా ఉందని కూడా అభిప్రాయపడుతున్నారు. కాబట్టి తయారీ మరియు ఎగుమతులను పెంచినప్పటికీ, ఈ పథకం అమలు జాప్యాలు, దిగుమతి ఆధారితత, అధిక ఖర్చులు, నియమాల అనుసరణ సమస్యలు మరియు మౌలిక సదుపాయాల లోపాలు వంటి సవాళ్లను ఇంకా ఎదుర్కొంటోంది.

ఉత్పత్తి అనుసంధాన ప్రోత్సాహక పథకం పథకాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం అనుమతి ప్రక్రియలను సరళీకరించి, పరిశ్రమలకు ప్రోత్సాహకాలను వేగంగా విడుదల చేయడం నిర్ధారించాలి. చిన్న సంస్థలు సరఫరా శృంఖలాల్లో పాల్గొని దేశీయ విలువ జోడింపును పెంచేందుకు చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు లకు మరింత మద్దతు ఇవ్వాలి. ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్, సౌర రంగాల్లో స్థానిక భాగాల తయారీని ప్రోత్సహించడం ద్వారా దిగుమతి ముడి పదార్థాలపై ఆధారాన్ని భారత్ తగ్గించాలి. రవాణా, లాజిస్టిక్స్, పోర్టులు, విద్యుత్ సరఫరా వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం ద్వారా పరిశ్రమలు ఉత్పత్తి ఖర్చులను తగ్గించగలవు.

అధునాతన తయారీ రంగాల కోసం అత్యంత నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తిని తయారు చేయడానికి ప్రభుత్వం నైపుణ్య అభివృద్ధి , సాంకేతిక శిక్షణలో మరింత పెట్టుబడి పెట్టాలి. పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంచేందుకు స్థిరమైన వాణిజ్య విధానాలు, దీర్ఘకాలిక విధాన స్పష్టత అవసరం. భారత పరిశ్రమల గ్లోబల్ పోటీ సామర్థ్యాన్ని పెంచడానికి పరిశోధన, ఆవిష్కరణ మరియు సాంకేతిక బదిలీపై మరింత దృష్టి పెట్టాలి. క్రమం తప్పకుండా పర్యవేక్షణ, రంగాల వారీ పనితీరు సమీక్షలు సమస్య లను ముందుగానే గుర్తించి, ప్రోత్సాహక పథకం అమలును మెరుగుపరచడంలో సహాయ పడతాయి. ఇలా చేయడం ద్వారా ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాలను సాధించవచ్చు.

**- డాక్టర్. పి.ఎస్. చారి**

8309082823

## నీవు జ్ఞాపకాల్లో బతికుండే ప్రేమ చూపించు

ఈ పదవులు, హోదాలు
అన్నీ కొన్నిరోజుల ఆటలే

నీవు పయనించే పడవ
ఎప్పుడైనా తుఫాన్లో మునిగి పోవచ్చు

కలలు కనడంలో తప్పులేదు
కళ్లు మూసుకొని నడిస్తేనే ముప్పు

సమయం, కర్తవ్యాన్ని మరిచి పోనివ్వదు
అందుకే, గుచ్చి గుచ్చి గుర్తు చేయడానికి
గడియారంలో, తిరిగే ముళ్లుంటాయి

నీవు బతికున్నట్టు ఏదైనా
రుజువు చూపించు
రేపు వెళ్లిపోయినా, జ్ఞాపకాల్లో
బతికుండే ప్రేమ చూపించు

దుఃఖించని వాళ్లకు
జీవించడం తెలియదు
జీవితానికి, కళ్లు తుడవడం,
గుండె తడపడం తెలుసు

**- ఆశారాజు**

9392302245

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు **manamlekhalu@gmail.com** మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.

**ఈ పేపర్ కోసం** https://www.manamepaper.com/ వెబ్‌సైట్‌లో చూడండి

- ఎడిటర్

## కుప్పం నియోజకవర్గంలో వ్యవసాయ అనుబంధ రంగాలలో మంచి ఫలితాలు సాధించాలి



- **నియోజకవర్గంలో ఉద్యానవన పంటలపై రైతులకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి: కలెక్టర్ సుమిత్ కుమార్**

కుప్పం, మే,13 మనం న్యూస్: కుప్పం నియోజకవర్గంలో రోజుకి 10 లక్షల లీటర్ల పాల ఉత్పత్తిని సాధించాలని లక్ష్యంతో కార్యచరణ ప్రణాళికల అమలు చేయాలి అని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు, బుధవారం కుప్పంలోని కడ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వ్యవసాయం, ఉద్యానవనం, పట్టు పరిశ్రమ మరియు పశుసంవర్ధక శాఖల పనితీరుపై జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో పీడీ కడ వికాస్ మర్మట్, పీకేఎం అర్బన్ డెవలప్మెంట్ చైర్మన్ డాక్టర్ సురేష్ నియోజకవర్గంలోని అన్ని మండలాల సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో పశుగ్రాస అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని, కమ్యూనిటీ ఫాడర్ డెవలప్మెంట్ ద్వారా పశుగ్రాస సరఫరాను పెంచాలని తెలిపారు 2028 నాటికి కుప్పంలో రోజుకు 10 లక్షల లీటర్ల పాల ఉత్పత్తి లక్ష్యంగా చర్యలు చేపట్టాలి సహజ వ్యవసాయం, ఉద్యాన పంటలు, పూలు, పట్టు ఉత్పత్తి వంటి రంగాల్లో రైతులను ప్రోత్సహించాలి ఉద్యానవన రంగంలో మామిడి, టమోటా, అరటి వంటి సాంప్రదాయ పంటలతో పాటు డ్రాగన్ ఫ్రూట్, బ్లూబెర్రీ వంటి విలువైన విదేశీ పంటల సాగుకు రైతులను ప్రోత్సహించాలి ప్రోత్సహించనున్నారు. వ్యవసాయ రంగంలో వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించి, చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, వేరుశెనగ వంటి ప్రత్యామ్నాయ పంటల పై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

రైతు సంఘాలు మరియు బ్యాంకులతో సమన్వయం చేసి ఆదర్శ రైతులను గుర్తించి ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు పట్టు పరిశ్రమ అభివృద్ధికి ఆటోమేటిక్ రీలింగ్ యూనిట్లు, పెంపక షెడ్స్ సంఖ్య పెంపు, మహిళా సంఘాల ద్వారా పట్టు ఉత్పత్తి ప్రోత్సాహానికి చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. 2027 నాటికి కుప్పంను సిల్క్ హబ్గా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో సంబంధిత శాఖ అధికారులు కృషి చేయాలని పేర్కొన్నారు, కుప్పంలో పశుగ్రాస అభివృద్ధికి, ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో 80 శాతం పచ్చదనానిక పెంచేందుకు, కుప్పం నియోజకవర్గంలోని అన్ని మండలాలలో పెరటి కోళ్ళ పెంపకందారుల గుర్తించి వారి ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వ్యవసాయ అనుబంధ రంగాల హెచ్ ఓ డి లు, అన్ని మండలాల సంబంధిత శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ధరలు తగ్గించకపోతే భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకుంటాం



- **ఆక్వా రైతు సంఘం రాష్ట్ర కమిటీ తీర్మానం**

పాలకొల్లు, మే 13,మనం ప్రతినిధి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడు మరియు అప్సడ తో ఫీడ్ కంపెనీల యజమానులు శుక్రవారం జరిగే సమావేశంలో పెంచిన మేత ధరలు ఉపసంహరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా అక్వా రైతులంతా భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకుంటామని పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు లో జరిగిన రాష్ట్ర ఆక్వా కమిటీ సమన్వయ సమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో జయభారత్ క్షీరా రామ ఆక్వా రైతు సంఘం అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు, తదితరులు మాట్లాడారు. వనామి కంపెనీ టన్నుకు ఎనిమిది వేలు రూపాయలు, టైగర్ కంపెనీ టన్నుకు పదివేలు రూపాయలు పెంచి ఆక్వా రైతుల నడ్డి విరిసిందని విమర్శించారు. సమావేశంలో కృష్ణ, గుంటూరు, నెల్లూరు, ఏలూరు, తూర్పు పశ్చిమగోదావరి జిల్లాల రాష్ట్ర సమన్వయ కమిటీ సభ్యులు హాజరయ్యారు.

## రాష్ట్ర అభివృద్ధి నాయకుడికి ఘన స్వాగతం పలుకుదాం రండి..!


- **నారా లోకేష్ పర్యటనకు స్వాగతంగా బైక్ ర్యాలీ**

ధర్మవరం అర్బన్, మే 13 - మనం న్యూస్: రాష్ట్ర అభివృద్ధి, యువత సంక్షేమం, ఆధునిక పాలన లక్ష్యంగా ముందుకు సాగుతున్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ సత్యసాయి జిల్లాకు తొలిసారిగా విచ్చేస్తున్న సందర్భంగా ధర్మవరంలో పార్టీ శ్రేణులు ఘన స్వాగత ఏర్పాట్లు చేపట్టాయి. పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు గురువారం జరగనున్న నారా లోకేష్ పర్యటనను విజయవంతం చేయాలని లక్ష్యంగా పెట్టుకుని 25వ వార్డు, 26వ వార్డు కార్యకర్తలు సంయుక్తంగా భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా టీడీపీ జెండాలు, నినాదాలతో సాగిన ర్యాలీ ప్రజలను ఆకట్టుకుంది. యువత, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని పార్టీ పట్ల తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా 25వ, 26వ వార్డు ప్రోగ్రాం కోఆర్డినేటర్ భీమనేని ప్రసాద్ నాయుడు మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధి కోసం నారా లోకేష్ నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు, సాంకేతిక విద్యాభివృద్ధి, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, డిజిటల్ పరిపాలన వంటి అంశాల్లో ఆయన ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని తెలిపారు. అలాగే పార్టీ కార్యకర్తలకు ఎప్పటికప్పుడు అండగా నిలుస్తూ, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కార మార్గాలు చూపుతున్న నాయకుడు నారా లోకేష్ అని కొనియాడారు.

గ్రామ స్థాయి కార్యకర్తల నుంచి రాష్ట్ర స్థాయి నాయకుల వరకు ప్రతి ఒక్కరినీ ప్రోత్సహిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో యువ నాయకత్వానికి కొత్త దిశానిర్దేశం చేస్తూ ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తున్న నారా లోకేష్ పర్యటనతో పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొందని కార్యకర్తలు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో 25వ వార్డు, 26వ వార్డు కార్యకర్తలు, యువ నాయకులు, పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## ఆచంటలో నూతన వధూవరులు ప్రవీణ్.. శ్రావణిల ఘనంగా వివాహం



- **ఆశీర్వదించిన బంధుమిత్రులు**
- **సంతోషంలో వధూవరుల తల్లిదండ్రులు**

ఆచంట మే 13 మనం న్యూస్ ఆచంట మండలం పెద్ద పేట వాస్తవ్యులు దబ్బ ప్రవీణ్ కుమార్ ఉష దంపతుల ఏకైక కుమార్తె వధువు శ్రావణి కి వరుడు సోనీ కుమార్ల వివాహం బుధవారం ఆచంట పెద్ద పేట సెయింట్ ఇమ్మానియేల్ లూథరన్ చర్చిలో వివాహం అంగరంగ వైభవంఈగా జరిగింది ఈ మేరకు నూతన వధూవరులకు పెద్దలు నిశ్చయించిన మేరకు .. బి ఏ బి డి.. బీసీ ఎస్ గురు మండల అధ్యక్షులు దైవజనులు రెవరెండ్ కొం బత్తుల ఎం మదన్ కుమార్ నూతన వధూవరులకు పరిశుద్ధ వివాహం జరిపించారు అనంతరం స్థానిక కమ్మ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన భోజన ఆతిథ్యానికి దేశ నలుమూలల రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర దేశాలలో స్థిరపడిన బంధుమిత్రులు శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి అన్ని రంగాలలో ఆర్థిక అభివృద్ధి చెంది ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు ఆయా శాఖల అధికారులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు

## కొంతంగి అగ్ని ప్రమాద బాధితులకు ముద్రగడ ఆర్థిక సహాయం



- **నూతన గృహాలు మంజూరు చేయాలని డిమాండ్..**

శంఖవరం మే 13 మనం ప్రతినిధి : కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం లో శంఖవరం మండలం కొంతంగి ఎస్సీ కాలనీలో జరిగిన ఘటనతో గ్రామంలో విషాదం చోటు చేసుకుంది కుంచే వీర్రాజు, ఆనందరావు, శ్రీను, గుడ్ల వాసు కుటుంబాల ఇళ్లు పూర్తిగా అగ్నికి ఆహుతి అయిన విషయం తెలిసిందే.. సుమారు రూ.4 లక్షల నగదు, బంగారు ఆభరణాలు, గృహోపకరణాలు కాలి పోయినట్లు వాపోయిన బాధితులు ఘటనపై బుధవారం ప్రతిపాడు నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ ముద్రగడ గిరిబాబు బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఘటనాస్థలికి చేరుకుని బాధిత కుటుంబాలకు బియ్యం,నిత్యావసర సరుకులు, దుస్తులు అందించారు. ప్రభుత్వ అధికారులతో మాట్లాడి బాధిత కుటుంబాలకు న్యాయం చేకూరే విధంగా కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నూతన గృహాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు నరాల శ్రీనివాస్, అడపా సోమేష్, సకురు గుర్రాజు, చల్ల సత్యప్రసాద్ తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మేతల కంపెనీలన్నీ సిండికేట్ అయ్యి ఆక్వారైతులను దోపిడీ చేస్తున్నాయి..

- **ఆక్వా రైతు సంఘ నాయకుడు నాగ భూషణం..**
- **రొయ్యల మేతల ధరల పెంపుపై ఆక్వారైతుల నిరసన..**



అమలాపురం, మే 13 మనం న్యూస్ ఆక్వా మేతల కంపెనీలన్నీ సిండికేట్గా మారడం వల్లనే ఆక్వారైతులకు తీరని అన్యాయం చేసేలా మేతల కంపెనీలు ధరలు పెంచేశాయని ఆక్వారైతు సంఘ నాయకుడు త్సవటపల్లి నాగభూషణం ఆరోపించారు. వరుస దెబ్బలతో సతమతవుతున్న ఆక్వారైతులు ఇప్పుడు ధరలు పెంచడంతో మరింత కుదేలయ్యే పరిస్థితిలోకి వెళ్లారన్నారు. కాట్రేనికోన మండలం చెయ్యేరులో నాగభూషణం ఆధ్వర్యంలో ఆక్వా మేతల ధరలు పెంపును నిరసిస్తూ నిరసన చేపట్టారు. ఈసందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ మేతల కంపెనీలు తీసుకున్న నిర్ణయంతో కిలోకు రూ.8 భారం పడుతుందని, దీని ప్రభావంతో ఎకరా విస్తీర్ణంలో ఆక్వాసాగుకు రూ.40 వేలు నుంచి రూ.50 వేలు మేరకు అదనపు భారం పడుతుందన్నారు. గతంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకాల బాధ అంతలోనే ఇరాన్. ఇజ్రాయేల్, అమెరికా మధ్య యుద్ధం, ఆతరువాత డీజిల్ సంక్షోభంతో ఆక్వారంగం తీవ్రంగా నష్టపోయిందని, తాజాగా మేతలు ధరలు పెంచుతూ నిర్ణయం తీసుకోవడం వల్ల మరింత నష్టాలపాలయ్యే పరిస్థితి తలెత్తిందన్నారు. ప్రస్తుతం ఆక్వా పరిశ్రమ వెంటిలేట్స ఉందని, ప్రభుత్వం ఆదుకోకుంటే ఆక్వా పరిశ్రమ వరుస నష్టాలతో కుదేలవ్వక తప్పదన్నారు. ట్రంప్ సుంకమని 25 శాతం పెంచితే ఏప్రిల్ నెలలో అమలు చేసి ఆగస్టు నెలలో ఇంప్లిమెంట్ చేశారని, దీంతో 15 నుంచి 25 వేల కోట్లు నష్టపోయారని స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబే చెప్పారని, కానీ నష్టపోయింది రైతులే కానీ ఎక్స్పోర్టర్ కాదన్నారు. రైతులు వరుసగా ఇబ్బందులు పడుతున్నారని, యుద్ధం వంకతో తక్కువ ధరలకు కొనుగోలు చేశారని, ఆతరువాత ఆయిల్ సంక్షోభం పెరుతో టన్నుకు రూ.10 వేలు లాగేశారన్నారు. ఇది పూర్తిగా ప్రభుత్వం యొక్కవైఫల్యం అన్నారు. ఇప్పడు ముడిసరుకుల ధరలు పెరిగాయని చెప్పి అన్ని కంపెనీలు అన్నీ మూకుమ్మడిగా ధరలు పెంచాయని ఆవేదన వ్యక్తం చేశారు. మేతల ధరలను ప్రభుత్వం నియంత్రించకుంటే రాబోయే రోజుల్లో అన్ని జిల్లాల ఆక్వారైతులను కలుపుకుని కార్యచరణ ప్రకటిస్తామని నాగభూషణం హెచ్చరించారు. ఆక్వా బతకాలంటే సిండికేట్ వ్యవస్థ పోవాలంటూ.. పెంచిన మేతల ధరలను వెంటనే తగ్గించాలంటూ నినాదాలు చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో త్సవటపల్లి మణికుమార్, గుత్తుల ధర్మరాజు, నంద్యాల బాబి, కాయల బలరామ మూర్తి, సూదా రాఘవేంద్ర, బొక్కా హరి, కనకాల సతీష్, నంద్యాల శివ, నంద్యాల వేంకటేశ్వర రావు, అక్కల బాలకృష్ణ, గాలిదేవర దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు నారా లోకేష్ పర్యటన. బత్తలపల్లి లో ఆర్డిటి ఆసుపత్రి సందర్శన. అనంతలో టిడిపి కార్యకర్తలతో సమావేశం



అనంతపురం. మే 13. మనం న్యూస్ ప్రతినిధి. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ జిల్లా పర్యటన షెడ్యూల్ ఖరారైంది. ఈనెల 14వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు ఆయన ఉండవల్లిలోని తన నివాసం నుంచి బయలుదేరి 10 15 గంటలకు వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయానికి చేరుకుంటారు.10.30 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకూ పలు కార్యక్రమాలలో పాల్గొంటారు. మధ్యాహ్నం రెండు గంటలకు బయలుదేరి 2.50 గంటలకు గన్నవరం ఎయిర్పోర్ట్ చేరుకుంటారు. 3 గంటలకు అక్కడి నుంచి విమానంలో బయలుదేరి 3:45 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ 15 నిమిషాల విరామం అనంతరం సాయంత్రం నాలుగు గంటలకు పుట్టపర్తి ఎయిర్పోర్ట్ నుంచి రోడ్డు మార్గాన కారులో 5:15 గంటలకు బత్తలపల్లి లోని ఆర్డిటి ఆసుపత్రికి చేరుకుంటారు.సాయంత్రం 5.15 నుండి 6.15 వరకూ గంటపాటు ఆర్డిటి ఆసుపత్రిని సందర్శిస్తారు. ఆస్పత్రిలోని వైద్య సేవలను అడిగి తెలుసుకుంటారు. అక్కడి నుంచి 6.15 గంటలకు బయలుదేరి రాత్రి 7 గంటలకు అనంతపురం శ్రీనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశం వేదికకు చేరుకుంటారు. రాత్రి 10 గంటల వరకు టిడిపి కార్యకర్తల సమావేశం జరుగుతుంది. రాత్రికి శ్రీనగర్ కాలనీలోనే బస చేస్తారు.శుక్రవారం పర్యటన ఖరారు కాలేదు.

## 20 లోపు జనగణన పూర్తి చేయాలి : తహసీల్దార్



కాట్రేనికోన మే 13 మనం న్యూస్ : జనగణనకు సంబంధించి కాట్రేనికోన మండలంలో జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల ప్రకారం అందరు సూపర్వైజర్లకు ఎంపీడీవో కార్యాలయం నందుబుధవారం సాయంత్రం సమావేశం నిర్వహించడం జరిగిందని తహసీల్దార్ రవి కిరణ్ తెలిపారు . సదరు మీటింగులో 20వ తారీకు లోపు అందరి ఎన్యూమరేటర్లతో జన గణన అత్యంత పారదర్శకంగా పూర్తి చేయవలసిందిగా ఆదేశించడం జరిగిందని అయన తెలిపారు.

కార్యక్రమం లో సూపర్వైజర్ లు పాల్గొన్నారు

# రొయ్యల దాణా ధరల పెంపు నిలిపివేత

**రైతుల కష్టాలపై వ్యాపారం చేయొద్దు**
**మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**



**అమరావతి/ శ్రీకాకుళం , మే 13 మనం న్యూస్ బ్యూరో:** ఆక్వా రైతుల ప్రయోజనాలకు విఘాతం కలిగించే ఏ నిర్ణయాన్నీ కూటమి ప్రభుత్వం సహించదని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రొయ్యల ఫీడ్ ధరలను ఒక్కసారిగా పెంచడం వల్ల రాష్ట్రంలోని వేలాది ఆక్వా రైతులపై తీవ్ర ఆర్థిక భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తూ, ఫీడ్ తయారీ సంస్థల ప్రతినిధులు, రైతు సంఘాలు, అధికారులతో బుధవారం మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రంగా స్పందిస్తూ, రైతుల అభిప్రాయాలు తీసుకోకుండా ఏకపక్షంగా ధరలు పెంచడం సరైన విధానం కాదన్నారు. ప్రస్తుతం ఆక్వా రంగం ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటోందని, ఇలాంటి సమయంలో రైతులపై అదనపు భారం మోపే చర్యలు తీసుకుంటే ప్రభుత్వం ఊరుకోదని హెచ్చరించారు. రైతుల ప్రయోజనాలు కాపాడటమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.మంత్రి ఆదేశాల నేపథ్యంలో ష్రిమ్ప్ ఫీడ్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ప్రతినిధులు స్పందిస్తూ, పెంచిన ఫీడ్ ధరల అమలును తక్షణమే నిలిపివేస్తున్నట్లు ప్రభుత్వానికి లిఖితపూర్వకంగా తెలియజేశారు. ముడి పదార్థాల ధరలు నిరంతరం పెరుగుతున్న కారణంగా ఫీడ్ ధరల సవరణపై ఆలోచించాల్సి వచ్చిందని అసోసియేషన్ పేర్కొన్నప్పటికీ, మంత్రి అచ్చెన్నాయుడు సూచనలు, మార్గదర్శకాలను గౌరవిస్తూ ధరల పెంపును వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. రైతులు, ఫీడ్ తయారీ సంస్థలు, అధికారులు పాల్గొనే ఉమ్మడి సమావేశం ఈ నెల 15న నిర్వహించనున్నట్లు మంత్రి వెల్లడించారు. అందరి అభిప్రాయాలు, సూచనలు పరిగణనలోకి తీసుకుని రైతులకు నష్టం కలగకుండా, పరిశ్రమ కూడా కొనసాగగలిగే విధంగా పరస్పర ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఆక్వా రంగాన్ని కాపాడేందుకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని, రైతుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని మంత్రి అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో ఏపీఎస్ఎడియే కో-వైస్ చైర్మన్, పశుసంవర్ధక, పాడి అభివృద్ధి, మత్స్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, మత్స్యశాఖ కమిషనర్తో పాటు ఎస్ఐఎఫ్టి, సిఐబీఏ, సిఐఎఫ్ఏ, సిఐఎఫ్టి, మత్స్య విశ్వవిద్యాలయం ప్రతినిధులు, రొయ్యల రైతులు, ఫీడ్ తయారీ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆకాశవాణి 90 వసంతాల వేడుకల్లో భాగంగా ఈ నెల15న కళాభారతిలో సంగీత కార్యక్రమం




**విశాఖపట్నం, మే 13:** ఆకాశవాణి ప్రారంభమై 90 వసంతాలు పూర్తయిన సందర్భంగా విశాఖ నగరంలోని కళాభారతి ఆడిటోరియంలో ఈ నెల 15వ తేదీ శుక్రవారం సాయంత్రం 6 గంటలకు ఆకాశవాణి ఆధ్వర్యంలో 'అలనాటి మధుర భావ గీతాలు' శీర్షికన డాక్టర్ ద్వారం వి.కె.జి త్యాగరాజు సంగీత నిర్వహణలో ప్రత్యేక కార్యక్రమం జరుగుతుందని ఆకాశవాణి కేంద్రం డైరెక్టర్ జనరల్ ఎం.ఆర్.హర్షలత, కార్యక్రమ నిర్వహణాధికారి పి.వి.రామగోపాల్ బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలంతా ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

## పేరుకు పోయిన వ్యర్థాలను వెంటనే తొలగించాలి

- జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్



**అనకాపల్లి, మే 13 మనం న్యూస్ :** అనకాపల్లి జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామ పంచాయతీలలో పేరుకుపోయిన వ్యర్థాలను వెంటనే పూర్తిగా తొలగించి పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్ అధికారులను ఆదేశించారు . బుధవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిప్యూటీ ఎంపీడీఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా కూడా వ్యర్థాలు లేకుండా సమగ్ర కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మండలాలు, గ్రామ పంచాయతీలలో వ్యర్థాలను గుర్తింపు, విభజన, శుద్ధి, మరియు శాశ్వత పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అవసరమైన యంత్రాలు, సిబ్బంది, నిధులను సమకూర్చి కొని పనులను పురమాయించి వేగవంతం చేయాలని ఆదేశించారు.ప్రతి మండలంలో గార్బేజ్ ట్రాన్సిట్ స్టేషన్లు ఏర్పాటు చేసి, చెత్త సేకరణ మరియు రవాణా వంటి వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. అన్ని వీధి దీపాలు సక్రమంగా వెలిగేలా చూసుకోవాలని, ఎక్కడా లోపాలు లేకుండా మరమ్మత్తులు ఉంటే తక్షణమే మరమ్మతులు చేయాలని సూచించారు. ప్రతి ఇంటిలో సొంత మరుగుదొడ్లు ఉండేలా మరియు వాటిని వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్ను వసూళ్లను మరింత మెరుగుపరచాలని , పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం ఉండకుండా లక్ష్యాలను చేరుకుని జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలపాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి సందీప్, డి ఎల్ డి ఓ, డిప్యూటీ ఎం పి డి ఓ లు, పాల్గొన్నారు.

# సింహాచలం దేవస్థానం హుండీ లెక్కింపులో దొంగతనం



- నిందితుడు పట్టివేత

**సింహాచలం మే 13 మనం న్యూస్ :** సింహాచల శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారి దేవస్థానంలో బుధవారం నిర్వహించిన హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఒక విచారకరమైన ఘటన చోటుచేసుకుంది. స్వామివారికి భక్తులు సమర్పించిన కానుకలను లెక్కిస్తున్న సమయంలో నగదు దొంగతనానికి పాల్పడిన ఒక వ్యక్తిని భద్రతా సిబ్బంది రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. దేవస్థాన నిబంధనల ప్రకారం బుధవారం హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీహరి సేవా సంఘం తరపున స్వచ్ఛంద సేవకుడిగా వచ్చిన బి రాంబాబు (79) అనే వ్యక్తి పాల్గొన్నారు. లెక్కింపు జరుగుతుండగా, సుమారు ఉదయం 11:20 గంటల సమయంలో నిందితుడు అత్యంత తెలివిగా రూ. 17,100/- నగదును దొంగిలించి, తన చేతిలో దాచుకుని బయటకు వెళ్లేందుకు ప్రయత్నించారు. అక్కడ విధుల్లో ఉన్న ఎస్.పి.ఎఫ్ పోలీస్ సిబ్బంది నిందితుడి కదలికలపై అనుమానంతో తనిఖీ చేయగా, దొంగిలించిన నగదు బయటపడింది. వెంటనే సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు.దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆదేశాల మేరకు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సింగం రాధ నిందితుడిని నగదుతో సహా గోపాలపట్నం పోలీసులకు అప్పగించారు. దేవస్థాన పవిత్రతను దెబ్బతీసేలా ప్రవర్తించిన సదరు వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా హుండీ లెక్కింపు వద్ద భద్రతను మరింత కట్టుదిట్టం చేస్తామని దేవస్థాన అధికారులు ఈ సందర్భంగా తెలియజేశారు.

# అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై పి.డి. యాక్టు

- విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్,



**విజయనగరం మే 13 మనం న్యూస్ :** విజయనగరం జిల్లాలో వివిధ పోలీసు స్టేషనుల్లో పని చేస్తున్న పోలీసు అధికారులతో బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నేర సమీక్ష సమావేశాన్ని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ నిర్వహించి, దర్యాప్తులో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్, ఎన్.డి.పి.ఎస్., పోక్సో, అట్రాసిటీ, మిస్సింగు, చోరీ, రోడ్డు ప్రమాద కేసులను, సోషల్ మీడియా కేసులను సమీక్షించి, అధికారులకు పలు సూచనలు చేసారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ - అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిరంతరం నిఘా పెట్టాలని, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై పి.డి.యాక్టునుప్రయోగించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో గ్రామ, వార్డు సందర్శనలు చేయాలని, క్షేత్ర స్థాయిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అంశాలను ప్రాథమిక స్థాయిలో గుర్తించి, వాటిని పరిష్కరించాలన్నారు. గ్రామాలు, వార్డుల్లో అల్లర్లు సృష్టించేందుకు అవకాశం ఉన్న వ్యక్తులను ముందుగా గుర్తించి, మంచి ప్రవర్తన కోసం వారిని బైండోవరు చేయాలని అధికారులను ఆదేశించారు. హిస్టరీ షీట్లు కలిగిన వ్యక్తులపై నిఘా పెట్టాలని, వారి కదలికలను గమనించాలని, అవసరమైతే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి కేసుల్లో నిందితులుగా ఉన్న వ్యక్తులపై హిస్టరీ షీట్లను ప్రారంభించాలని, వారి కదలికలపై నిఘా పెట్టి, గంజాయి అక్రమ రవాణకు, విక్రయాలకు పాల్పడకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతీ పోలీసు స్టేషను పరిధిలో నేరాలు జరిగేందుకు అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగా గుర్తించి, ఆయా ప్రాంతాల్లో నేరాలు జరగకుండా సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. నేరాల నియంత్రణలో సిసి కెమెరాల పాత్ర క్రియాశీలకంగా మారుతున్నందున అపార్టుమెంట్లు, వ్యాణిజ్య సముదాయలు, వ్యాపారులు, కాలనీ వాసులకు సిసి కెమెరాల ప్రాధాన్యతను వివరించి, ఆయా ప్రాంతాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యతనివ్వాలని, అవసరమైన మౌళిక వసతులను కల్పించాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. టెక్నాలజీని వినియోగించుకొని కేసుల మిస్టరీని చేధించాలన్నారు. గంజాయి నియంత్రణ, మహిళల భద్రత, రహదారి భద్రత, సైబరు నేరాల నియంత్రణకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. గంజాయి వినియోగం వలన కలిగే దుష్ప్రభావాలను ప్రజలకు వివరించాలన్నారు. ప్రజలకు నిత్యం పోలీసులు అందుబాటులో ఉంటూ పోలీసు సేవలను విస్తృతం చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో సమాచార సేకరణకు, ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాల్లో ఆయా గ్రామాల దత్తత కానిస్టేబుళ్ళు, మహిళా సంరక్షణ పోలీసుల (ఎం.ఎస్.పి) సేవలను వినియోగించుకోవాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు.
నేరాలు జరగకుండా రాత్రి గస్తీని, పెట్రోలింగును ముమ్మరం చేయాలని, నేరాలు జరిగేందుకు అవకాశం ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. దర్యాప్తు చేపట్టే అన్ని కేసుల్లోను ఈ-సాక్ష్య యాప్ ను వినియోగించాలని, ఫోటోలను, వీడియోలను ఈ-సాక్ష్యలో నిక్షిప్తం చేయాలన్నారు. కొత్త క్రిమినల్ చట్టాలకు అనుగుణంగా గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల్లో అభియోగ పత్రాలను నిర్దిష్ట సమయంలోగా ఆయా న్యాయస్థానాల్లో దాఖలు చేయాలన్నారు. మైనరు డ్రైవింగు, హెల్మెట్ ధారణ, డ్రంకన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగుపై ప్రత్యేక దృష్టి పెట్టి, కేసులు నమోదు చేయాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు.వివిధ పోలీసు స్టేషన్లలో నమోదై, దర్యాప్తులో ఉన్న ఎస్సీ, ఎస్టీ కేసులు, పోక్సో కేసులు, ఎన్డీపిఎస్, మిస్సింగు, మహిళలపై జరుగుతున్న దాడుల కేసులను, గ్రేవ్, నాన్ గ్రేవ్, ఎన్ఫోర్సుమెంటు కేసులను జిల్లా ఎస్పీ సమీక్షంచి, దర్యాప్తు పెండింగులో ఉండుటకుగల కారణాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకొని, దర్యాప్తు పూర్తి చేయుటకు అధికారులకు ఎస్పీ దిశా నిర్దేశం చేసారు. మిస్సింగు వ్యక్తులను ట్రేస్ చేయుటకు అదృశ్యమైన వ్యక్తుల ఫోటోలను సిసిటివి- 360 యాప్ లో అప్ లోడ్ చేసి, ఫేస్ రికగ్నిషన్ ఆధారంగా అదృశ్యమైన వ్యక్తుల ఆచూకీని గుర్తించాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు.ఈ నేర సమీక్ష సమావేశంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, డిఎస్పీలు ఆర్.గోవిందరావు, ఎస్.రాఘవులు, ఎం.వీరకుమార్, న్యాయ సలహాదారులు వై.పరశురాం, సీఐలు, వివిధ పోలీసు స్టేషనుల్లో పని చేస్తున్న ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆన్లైన్ క్రికెట్ బెట్టింగ్ ముఠా సభ్యులు అరెస్ట్

- విజయం సాధించిన విశాఖ సైబర్ క్రైమ్ పోలీస్




**విశాఖపట్నం మే 13 మనం న్యూస్ :** క్రికెట్ బెట్టింగ్ ముఠాలను అణచివేయడం లక్ష్యంగా భారత ప్రభుత్వం మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఆన్లైన్ మరియు ఆఫ్లైన్ క్రికెట్ బెట్టింగ్ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నాయి. ఇటువంటి అక్రమ కార్యకలాపాలు సామాజిక మాధ్యమాల ద్వారా విస్తరిస్తూ అమాయక యువతను తప్పుదోవ పట్టిస్తున్న నేపథ్యంలో, వాటిని నిర్మూలించేందుకు విశాఖపట్నం నగర పోలీస్ శాఖ సమర్థవంతమైన చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలో, విశాఖపట్నం నగర పోలీస్ కమిషనర్ అదనపు జిల్లా మేజిస్ట్రేట్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, ఆదేశాల మేరకు, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లో క్రైమ్ నెంబర్ 80/2025 ఖ/ట 112(1), 319(2), 318(4) ట/ఠీ 61(2) ఞాఖి, 2 66-ఇ, 66-ృ ఐఖీ అచ్టి 2000-08 2 4 3, 4 అ్క ఎ్చఝఙఞజ అచ్టి-1974 కింద కేసు నమోదు చేసి లోతైన దర్యాప్తు చేపట్టబడింది. దర్యాప్తులో భాగంగా, 'ఊజీటట్ట ఉ్ఛజీట ౖజ్ఛూడ, 'ఖ్ఛీఛీడఅఝ్ఛ' 'ఢ్ఛిజ్చిఃఇఛ్ఛ666' '4ఖఆ ఆ౯జు 2ఖజ్టాట్చగిఙ్ఞ 2 ) యాప్లను విదేశాల నుండి సేకరించి, గోవాను కేంద్రంగా చేసుకొని ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, జంషెడ్ పూర్ ఇతర రాష్ట్రాల్లో విస్తృతంగా అక్రమ ఆన్లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఒక ప్రధాన ముఠా కార్యకలాపాలు వెలుగులోకి వచ్చాయి. నిందితుల మొబైల్ డేటా ఆధారంగా సేకరించిన సమాచారం మేరకు, కమిషనర్ ఆఫ్ పోలీస్, విశాఖపట్నం సిటీ వారి అనుమతితో సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ కె. భవానీ ప్రసాద్ రావు ఆధ్వర్యంలో వారి సిబ్బంది ఎస్ ఐ ఆర్. వంశీ క్రిష్ణ, ఏ ఎస్ ఐ, బి. శ్రీనివాస రావు, హెచ్ సి ఎస్, ఎం.సత్యనారాయణ, ఆర్.చంద్ర శేఖర్, ఎస్. రమేష్, పిసీలు.టి సన్యాసి నాయుడు, బి. శివ, హోంగార్డులు ఎస్. రాజు, బి. అశోక్ లతో కలిసి కోల్కతాకు వెళ్లి, స్థానిక పోలీసుల సహకారంతో తే.21.04.2026దిన రెజెంట్ పార్క్ ప్రాంతంలోని ఒక నివాస గృహంపై దాడి నిర్వహించింది. ఈ దాడిలో ప్రధాన నిందితుడు పఖరాని కరణ్ అలెక్స్ గబ్బర్ తో పాటు అతని సహచరులు సరస అగర్వాల్, అరవింద్ విరిడి, కరణ్ సింగ్, సయాద్ అమనత్ హుస్సేన్, అంబుజ్ గోపి, పరస్ అగర్వాల్లను అదుపులోకి తీసుకున్నారు. వారిని తేది 22.04.2026 న విశాఖపట్నం చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ వారి ఎదుట హాజరు పరచగా వారికి 15 రోజులు రిమాండ్ విదించడమైనది. దర్యాప్తులో వెల్లడైన వివరాల ప్రకారం, నిందితుడు పఖరాని కరణ్ వివిధ రాష్ట్రాల వ్యక్తులతో కలిసి ఒక పెద్ద ఆన్లైన్ బెట్టింగ్ నెట్వర్కు ఏర్పాటు చేసి, టెలిగ్రామ్ మరియు ఇతర సోషల్ మీడియా ప్లాట్ఫారమ్ ల ద్వారా బెట్టింగ్ లింకులు పంపించి పంటర్లను ఆకర్షిస్తూ భారీ మొత్తంలో డబ్బు లావాదేవీలు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. అదేవిధంగా, నిందితులు వివిధ వ్యక్తుల నుండి బ్యాంక్ ఖాతాలను సేకరించి వాటిని బెట్టింగ్ లావాదేవీలకు ఉపయోగించడం, ఫ్రాంచైజ్ విధానంలో బెట్టింగ్ కార్యకలాపాలను విస్తరించడం వంటి విషయాలు కూడా వెలుగులోకి వచ్చాయి. పోలీసులు నిందితుల వద్ద నుండి మొబైల్ ఫోన్లు, ల్యాప్టాప్లు, బ్యాంక్ పాస్బుక్స్, చెకుక్స్, నోట్బుక్స్, పాస్పోర్టులు ఇతర కీలక డిజిటల్ ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. సీజ్ చేసిన వస్తువులపై ఫోరెన్సిక్ పరిశీలన కొనసాగుతోంది. ఈ కేసులో మరింత మంది నిందితులను గుర్తించేందుకు మరియు ఆర్థిక లావాదేవీలను ట్రాక్ చేయడానికి దర్యాప్తు కొనసాగుతోంది.ప్రజలు ఇటువంటి అక్రమ ఆన్లైన్ బెట్టింగ్ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, ఎవరైనా ఆన్లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహించే వారి కార్యకలాపాల గురించి సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని విశాఖపట్నం నగర పోలీస్ శాఖ విజ్ఞప్తి చేస్తోంది.

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా ఎస్పీ

- భద్రతా ఏర్పాట్లపై అధికారులకు కీలక సూచనలు
- ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి,



**శ్రీకాకుళం (నరసన్నపేట), మే 13 మనం న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 16 న శ్రీకాకుళం జిల్లా పర్యటనకు రానున్న నేపథ్యంలో, నరసన్నపేట సమీపంలోని జమ్ము తామరాపల్లి ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్,నరసన్నపేటలో సభా ప్రాంగణం, వాహనాల పార్కింగ్ స్థలాలు మరియు ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన రూట్ మ్యాప్ను జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్తో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా హెలిప్యాడ్ పరిసర ప్రాంతాల భద్రత, వీఐపీ రాకపోకలు, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల రాకపోకలకు అంతరాయం కలగకుండా తీసుకోవాల్సిన చర్యలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందన వ్యవస్థ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి నిర్ణయించిన రూట్ మ్యాప్లో భద్రతా పరమైన ఎటువంటి లోటుపాట్లు లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ అధికారులకు ఆదేశించారు.రూట్ వెంబడి ఉన్న కూడళ్లు, ప్రవేశ మరియు నిష్క్రమణ మార్గాలు, ప్రత్యామ్నాయ మార్గాలు, వాహనాల పార్కింగ్ ఏర్పాట్లు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి అవసరమైన సూచనలు చేశారు. హెలిప్యాడ్ ప్రాంతంలో ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, భద్రతా వలయాలు, బారికేడింగ్, సిబ్బంది మోహరింపు, కమ్యూనికేషన్ వ్యవస్థలు, ట్రాఫిక్ మళ్లింపు ఏర్పాట్లు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వహించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో టెక్కలి ఆర్డీవో ఎం. కృష్ణమూర్తి, డీఎస్పీ డి. లక్ష్మణరావు, ఎస్పీ ఇన్స్పెక్టర్ ఇమ్మాన్యువల్ రాజు, నరసన్నపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, సబ్ ఇన్స్పెక్టర్లు గణేష్, రంజిత్ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తాడిపత్రి లో 11మంది పేకాట రాయుళ్ళు అరెస్టు. రూ. 44,820 నగదు, 07 సెల్ ఫోన్లు, 06 బైక్లు స్వాధీనం




**అనంతపురం. మే 13.మనం న్యూస్ ప్రతినిధి.:** తాడిపత్రి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సజ్జలదిన్నె గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న పక్కా సమాచారంతో తాడిపత్రి రూరల్ యు.పి.ఎస్ సి.ఐ శివగంగాధర్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు. ఈ దాడిలో 11 మంది పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు.వారి నుండి రూ. 44,820 నగదు,07సెల్ ఫోన్లు,06 బైక్లు స్వాధీనం చేసుకున్నారు.అరెస్టు అయిన వారిని తాడిపత్రి చుట్టుపక్కల మండలాలకు చెందిన వారుగా పోలీసులు గుర్తించారు.అరెస్టు అయిన వారిలో తాడిపత్రి సంజీవనగర్ కు చెందిన పందిర్లపల్లి క్రిష్ణా రెడ్డి (35),సింగనామల మండలం కొరివిపల్లికి చెందిన చంద్రా రామచంద్రా రెడ్డి (44),తాడిపత్రి మండలం బ్రాహ్మణపల్లికి చెందిన ముసలిరెడ్డిగారి చిన్న ద స్త గి రి (50), తా డి ప త్రి కాసలువగడ్డవీధికి చెందిన తమ్మినేని ఉమాపతి నాయుడు (49),బ్రాహ్మణ పల్లికి చెందిన మిట్టమీద మహబూబ్ బాష (34),తాడిపత్రి శాస్త్రినగర్ కు చెందిన సామల గోపాల్ రెడ్డి (55),పుట్లూరు మండలం గాండ్లపాడుకు చెందిన మొలక తాళ్ల శ్రీనివాస రెడ్డి (45),తాడిపత్రి సంజీవనగర్ కు చెందిన అల్లే సుదర్శన్ రెడ్డి (43), జూటూర్ అమరనాథ రెడ్డి (40),హైదరాబాద్ కు చెందిన చల్లా మనోజ్ రెడ్డి (40), కొలిమిగుండ్ల మండలం గోరుమాను పల్లికి చెందిన గుమ్మెపల్లి గౌస్ లు ఉన్నారు.

# నేరగాళ్లకు అడ్డాగా మారుతున్న విశాఖ..!

- చైన్స్నాచింగ్లతో బేజారు
- ఉలిక్కిపడిన నగర వాసులు

**విశాఖ క్రైమ్: మనం న్యూస్:మే13** విశాఖపట్నం నగరం రోజురోజుకూ విస్తరిస్తూ ఆధునిక మహానగరంగా ఎదుగుతున్న వేళ, అదే స్థాయిలో నేరచర్యలు కూడా పెరుగుతుండటం ప్రజల్లో తీవ్ర కలవరాన్ని రేకెత్తిస్తోంది. ముఖ్యంగా మహిళలను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న చైన్స్నాచింగ్ ఘటనలు నగర భద్రతా వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. తాజాగా నగరంలో నిమిషాల వ్యవధిలో చోటుచేసుకున్న రెండు చైన్స్నాచింగ్ ఘటనలు స్థానికులను భయాందోళనలకు గురిచేశాయి. ఈ పరిణామాలు విశాఖ నగరం నేరగాళ్లకు స్వర్గధామంగా మారుతోందా అన్న అనుమానాలను బలపరుస్తున్నాయి. పోలీసుల కథనం ప్రకారం, మొదటి ఘటన ఉదయం వేళ నగరంలోని రద్దీ ప్రాంతంలో చోటుచేసుకుంది. ఇంటి అవసరాల నిమిత్తం బయటకు వచ్చిన ఓ మహిళను గమనించిన ఇద్దరు దుండగులు బైక్ వేగంగా వచ్చి మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కొని పరారయ్యారు. ఊహించని ఈ ఘటనతో బాధితురాలు ఒక్కసారిగా కేకలు వేయగా, చుట్టుపక్కల వారు స్పందించేలోపే నిందితులు కనుమరుగయ్యారు. బాధితురాలు తీవ్ర భయాందోళనలకు గురై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇదే ఘటన మరిచిపోకముందే, కేవలం కొద్ది నిమిషాల వ్యవధిలో మరో ప్రాంతంలో రెండో చైన్స్నాచింగ్ చోటుచేసుకోవడం నగర ప్రజలను మరింత ఆందోళనకు గురిచేసింది. రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధ మహిళను లక్ష్యంగా చేసుకున్న దుండగులు అత్యంత చాకచక్యంగా ఆమె మెడలోని బంగారు తాళిబొట్టును లాక్కొని పరారయ్యారు. ఒక్కసారిగా జరిగిన ఈ ఘటనతో వృద్ధురాలు షాక్కు గురై రోడ్డుపైనే కుప్పకూలినట్లు స్థానికులు తెలిపారు. ఈ రెండు ఘటనలు కూడా ఒకే తరహాలో జరగడంతో, నేరగాళ్లు ముందస్తు ప్రణాళికతో రెక్కీ నిర్వహించి దాడులకు పాల్పడుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రాంతాలను ఎంచుకుని, సీసీ కెమెరాలకు చిక్కకుండా మాస్కులు ధరించి దుండగులు సంచరిస్తున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. ఇటీవలి కాలంలో విశాఖ నగరంలో దొంగతనాలు, చైన్స్నాచింగ్లు, గంజాయి ముఠాల సంచారం, యువతను లక్ష్యంగా చేసుకున్న మోసాలు పెరుగుతుండటం సామాన్య ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోంది. రాత్రివేళల్లో మహిళలు ఒంటరిగా బయటకు రావడానికి కూడా వెనుకాడే పరిస్థితి నెలకొంది. పోలీస్ పహారా పెరిగిందని అధికారులు చెబుతున్నప్పటికీ, వరుస ఘటనలు మాత్రం ఆ వాదనలను నీరుగారుస్తున్నాయి.




స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ, నగరంలో భద్రత ఎక్కడుంది..? నేరగాళ్లు ఇంత ధైర్యంగా తిరుగుతుంటే ప్రజలు ఎలా జీవించాలి..? అంటూ ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా మహిళల భద్రతపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, కీలక ప్రాంతాల్లో హైటెక్ నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనలపై కేసులు నమోదు చేసిన పోలీసులు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించి సీసీ కెమెరాల ఆధారంగా నిందితుల కదలికలను విశ్లేషిస్తున్నారు. నగర సరిహద్దుల్లో తనిఖీలు ముమ్మరం చేసినట్లు అధికారులు తెలిపారు. త్వరలోనే నిందితులను అరెస్ట్ చేస్తామని పోలీసులు చెబుతున్నప్పటికీ, వరుస ఘటనలు విశాఖ నగర ప్రతిష్ఠపై మచ్చ తెస్తున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. నేరచర్యల పెరుగుదలతో విశాఖ నగరం క్రమంగా నేరగాళ్లకు అడ్డాగా మారుతోందా..? లేక పోలీస్ వ్యవస్థలో లోపాల వల్లే ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయా..? అన్న ప్రశ్నలు ఇప్పుడు ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయి.

# ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి రాజ్నాథ్ సింగ్ పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత

పుట్టపర్తిలో భారీ బందోబస్తు ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ సమీక్ష
వీఐపీ పర్యటనల నేపథ్యంలో పోలీస్ శాఖ అప్రమత్తం
కాన్వాయ్ రూట్లు, సభా ప్రాంగణ భద్రతపై అధికారులకు ఎస్పీ ఆదేశాలు
ట్రాఫిక్ అంతరాయం లేకుండా సమగ్ర ఏర్పాట్లు చేయాలి
జిల్లా ఎస్పీ సతీష్ కుమార్
నారా లోకేష్ పర్యటనకు ప్రత్యేక భద్రతా చర్యలు
సభా ప్రాంతంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు
సత్యసాయి విమానాశ్రయం నుంచి సభా స్థలం వరకు కట్టుదిట్టమైన నిఘా



శ్రీ సత్యసాయి జిల్లా, మే 13 మనం న్యూస్ : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా . చంద్రబాబు నాయుడు మరియు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజనాథ్ సింగ్ ఈ నెల 15న పుట్టపర్తి పర్యటనకు రానున్న నేపథ్యంలో చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ . సతీష్ కుమార్ బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సెక్టార్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి విమానాశ్రయం పరిసర ప్రాంతాల్లో చేపట్టాల్సిన బందోబస్తు చర్యలు, కాన్వాయ్ రూట్లలో అమలు చేయాల్సిన భద్రతా ఏర్పాట్లు, సభా ప్రాంగణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి కాన్వాయ్ ప్రయాణించే మార్గాలను ముందస్తుగా పరిశీలించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. వీఐపీ, వివిఐపీ వాహనాలు మరియు ప్రజల వాహనాల పార్కింగ్ ప్రాంతాల్లో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా సమర్థవంతమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సభా ప్రాంగణంలోని ప్రవేశ ద్వారాల వద్ద కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహించి ప్రజలకు అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని తెలిపారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. అనంతరం జిల్లా ఎస్పీ . సతీష్ కుమార్ , అడిషనల్ ఎస్పీ అంకిత సూరన మరియు ఇతర పోలీస్ అధికారులతో కలిసి సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. వేదిక ఏర్పాట్లు, వివిఐపీ, వీఐపీ ఎంట్రీలు, పార్కింగ్ ప్రాంతాలు, భారీ కేడ్లు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లపై సమగ్రంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఇదిలా ఉండగా, ఈ నెల 14న రాష్ట్ర మంత్రి నారా లోకేష్ పర్యటన నేపథ్యంలో కూడా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. గన్నవరం ఎయిర్పోర్ట్ నుండి ప్రత్యేక విమానం ద్వారా మధ్యాహ్నం 2.50 గంటలకు శ్రీ సత్యసాయి విమానాశ్రయానికి చేరుకుని, అనంతరం రోడ్డు మార్గాన బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రిలో జరిగే కార్యక్రమంలో మంత్రి పాల్గొననున్నారు. మంత్రి పర్యటన సందర్భంగా భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, కాన్వాయ్ మార్గం, విధులు నిర్వహించే సిబ్బంది రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు ఎస్పీ ఆదేశించారు.ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ అంకిత సూరన , డీఎస్పీలు నరసింగప్ప, శివన్నారాయణస్వామి, కేవీ మహేష్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్బి సీఐ వెంకటేశ్వర్లు, సీఐలు, ఎస్ఐలు మరియు సంబంధిత సెక్టార్ అధికారులు పాల్గొన్నారు

## నేడు బత్తలపల్లికి రానున్న ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్

పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో భారీ స్వాగత ఏర్పాట్లు
భారీగా వెలిసిన టీడీపీ జెండాలు, అంతటా సందడి వాతావరణం
మంత్రి లోకేష్ కు ఘన స్వాగతం పలుకుదాం.. శ్రీరామ్ పిలుపు
వేల మందికి మంచినీరు, మజ్జిగ, భోజన ఏర్పాట్లు



బత్తలపల్లి, మే 13 మనం న్యూస్ : ఐటీ, విద్యాశాఖ మంత్రి, టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ నేడు శ్రీ సత్యసాయి జిల్లా బత్తలపల్లికి రానున్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ శ్రేణులు బత్తలపల్లిని పసుపుమయంగా మార్చేశారు. నేడు సాయంత్రం ప్రత్యేక హెలికాప్టర్ లో మంత్రి లోకేష్ పుట్టపర్తి చేరుకోనున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో బత్తలపల్లికి రానున్నారు. బత్తలపల్లిలో ఆయన ఆర్డీటీ ఆసుపత్రిని సందర్శించనున్నారు. ఈ నేపథ్యంలో ధర్మవరం టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో భారీ స్వాగత ఏర్పాట్లు చేశారు. ధర్మవరం పట్టణం నుంచి బత్తలపల్లి వరకు టీడీపీ జెండాలు వెలిశాయి. బత్తలపల్లి ఏకంగా పసుపుమయంగా మారింది. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న కార్యకర్తలు భారీగా తరలివచ్చే అవకాశం ఉండటంతో అందుకు అనుగుణంగా శ్రీరామ్ మంచినీరు, మజ్జిగ, భోజన ఏర్పాట్లు చేయడంతో పాటు కార్యకర్తలు ఎక్కడా ఇబ్బంది పడకుండా స్వాగత ఏర్పాట్లు చేశారు. జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాతో పాటు ఆర్డీటీకి ఎఫ్.సి.ఆర్.ఏ రెన్యూవల్ చేయించిన తర్వాత తొలిసారి లోకేష్ జిల్లాకు వస్తుండటంతో ఎటు చూసినా నారా లోకేష్ ఫ్లెక్సీలు వెలిశాయి. దీంతో బత్తలపల్లి, ధర్మవరంలో ఒక సందడి వాతావరణం కనిపిస్తోంది. మంత్రి నారా లోకేష్ కు మనమంతా కృతజ్ఞతలు చెప్పాల్సిన సమయం ఇది అని ఈ సందర్భంగా శ్రీరామ్ కార్యకర్తలతో అన్నారు. ఆర్డీటీ సేవలు ఆగకుండా వేలాది మందికి పరోక్షంగా ఆయన సాయం చేసారన్నారు. ఢిల్లీ స్థాయిలో ఆయన ఎంతో కృషి చేయడం వలనే ఎఫ్.సి.ఆర్.ఏ రెన్యూవల్ అయిందన్నారు. అందుకే ఆయనకు స్వాగతం పలికేందుకు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న కార్యకర్తలంతా తరలి రావాలని శ్రీరామ్ పిలుపునిచ్చారు.

## రావులచెరువులో లేగ దూడల ప్రదర్శన



ధర్మవరం అర్బన్ మే 13 మనం న్యూస్: మండల పరిధిలోని రావులచెరువు గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లేగ దూడల (పెయ్యా దూడలు) ప్రదర్శన నిర్వహించినట్లు జిల్లా పశుగణాభివృద్ధి అధికారి వెంకటేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుమారు 37 లేగ దూడలను పాడి రైతులు శిబిరానికి తీసుకువచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో భాగంగా దూడలకు నట్టల నివారణ మందులు తాగించడంతో పాటు, ప్రతి దూడకు ఖనిజ లవణ మిశ్రమ బ్లాకులు మరియు కాల్షియం టానిక్లను ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి రైతుకు ప్రోత్సాహక బహుమతులు అందజేసినట్లు పేర్కొన్నారు. పోటీలో మొదటి విజేతగా రమణరెడ్డి ఆవు దూడ, రెండవ విజేతగా వెంకట రాముడు ఆవు దూడ, మూడవ విజేతగా వీరనారప్ప లేగ దూడ ఎంపికై ప్రోత్సాహక బహుమతులు అందుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడి పద్మాలత, చింతలపల్లి పశువైద్యాధికారి డాక్టర్ శేఖర్, డాక్టర్ శ్రీకాంత్, గ్రామ నాయకులు చెన్నారెడ్డి, మాధవరెడ్డి, గ్రామ పాడి రైతులు మరియు పశువైద్య సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## పుట్టపర్తిలో రూ.లక్ష కోట్ల ఫిఫ్త్ జనరేషన్ యుద్ధ విమానాల తయారీ ప్రాజెక్టు

- సత్యసాయి జిల్లాకు చారిత్రాత్మక రక్షణ రంగ పరిశ్రమ
- 650 ఎకరాల్లో డిఫెన్స్ మెగా ప్రాజెక్టు - వేలాదిమందికి ఉద్యోగావకాశాలు
- ఆమడగూరులో రూ.51 వేల కోట్ల రిలయన్స్ సోలార్ పవర్ ప్రాజెక్టు
- సత్యసాయి జిల్లా అభివృద్ధికి నూతన దిశ -ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి
- ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్లకు ప్రత్యేక కృతజ్ఞతలు
- మే 15న సీఎం చంద్రబాబు, కేంద్ర రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్ చేతుల మీదుగా శంకుస్థాపన



పుట్టపర్తి, మే 13 మనం న్యూస్: సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో రూ.లక్ష కోట్ల పెట్టుబడితో ఫిఫ్త్ జనరేషన్ యుద్ధ విమానాల తయారీ ప్రాజెక్టు ఏర్పాటు కావడం దేశ రక్షణ రంగ చరిత్రలోనే ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. సత్యసాయి బాబా ఆశీస్సులతో భారత రక్షణ రంగానికి సంబంధించిన అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్టు పుట్టపర్తికి రావడం జిల్లా ప్రజలకు గర్వకారణమన్నారు. పుట్టపర్తి సమీపంలో సుమారు 650 ఎకరాల్లో ఏర్పాటు కానున్న ఈ డిఫెన్స్ ప్రాజెక్టు ద్వారా వేలాది మందికి ప్రత్యక్ష, పరోక్షంగా ఉద్యోగ మరియు ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు.

దేశ భద్రతకు అత్యాధునిక సాంకేతికతతో తయారయ్యే ఫిఫ్త్ జనరేషన్ యుద్ధ విమానాల తయారీ కేంద్రంగా పుట్టపర్తి రూపుదిద్దుకోనుందని పేర్కొన్నారు. అదేవిధంగా ఆమడగూరు మండలంలో రూ.51 వేల కోట్ల వ్యయంతో 5 వేల మెగావాట్ల సామర్థ్యంతో రిలయన్స్ సోలార్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు కావడం సత్యసాయి జిల్లా అభివృద్ధికి మరో గొప్ప అవకాశమన్నారు. ఈ రెండు భారీ ప్రాజెక్టులు జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి, యువతకు ఉపాధి అవకాశాలకు, ప్రాంతీయ ఆర్థిక పురోగతికి కొత్త దిశను చూపనున్నాయని వెల్లడించారు. రాష్ట్రానికి భారీ పరిశ్రమలను తీసుకురావడంలో ప్రత్యేక చొరవ చూపిన ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్లకు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈనెల 15న పుట్టపర్తిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్నాథ్ సింగ్ చేతుల మీదుగా యుద్ధ విమానాల తయారీ ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమం జరగనున్న నేపథ్యంలో ఏర్పాట్లను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, ఆర్డీఓ సువర్ణ, జిల్లా అధికారులు పరిశీలించారు. కార్యక్రమ వేదిక, భద్రతా ఏర్పాట్లు, ప్రజల సౌకర్యాలు, పార్కింగ్, రహదారి అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులకు తగిన సూచనలు చేశారు. కార్యక్రమాన్ని అత్యంత విజయవంతంగా నిర్వహించాలని ప్రజాప్రతినిధులు, అధికారులను ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.


## ద్విచక్ర వాహనాల దొంగలు అరెస్ట్..

- ఆరు మోటార్సైకిళ్లు స్వాధీనం...



ధర్మవరం అర్బన్ మే 13,మనం న్యూస్: అనంతపురం జిల్లా ధర్మవరం పట్టణ పరిసర ప్రాంతాల్లో వరుసగా ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి ఆరు మోటార్సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు టూ టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టినట్లు చెప్పారు. దర్యాప్తులో అనంతపురం పట్టణంలోని ఇటుకలపల్లికి చెందిన చాకలి మధు, కదిరి పట్టణానికి చెందిన షేక్ ముబారక్ను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. నిందితులు పాత మోటార్సైకిళ్లు, బలహీనమైన లేదా చెడిపోయిన లాకులు ఉన్న వాహనాలను లక్ష్యంగా చేసుకుని, డూప్లికేట్ డమ్మీ కీలు తయారు చేసుకుని దొంగతనాలకు పాల్పడేవారని తెలిపారు. అనంతరం వాటిని ఇతర ప్రాంతాల్లో విక్రయించి అక్రమంగా డబ్బులు సంపాదించేవారని చెప్పారు. జల్సాలకు అలవాటు పడి ఈ తరహా నేరాలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలిందన్నారు. అదేవిధంగా ధర్మవరం మాత్రమే కాకుండా పలు ప్రాంతాల్లో నమోదైన కేసుల్లో కూడా నిందితులు ప్రమేయం ఉన్నట్లు గుర్తించినట్లు సీఐ వివరించారు. ప్రజలకు సూచనలు చేస్తూ, తమ వాహనాలను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని, బయట పార్క్ చేసే ద్విచక్ర వాహనాలకు చైన్ లాక్తో పాటు రెండు చక్రాలను కూడా లాక్ చేయాలని సూచించారు. ప్రతి వాహనానికి జీపీఎస్ ట్రాకింగ్ సదుపాయం ఉపయోగించుకోవాలని తెలిపారు. చట్టపరమైన పత్రాలు లేని వాహనాలను కొనుగోలు చేయవద్దని, తక్కువ ధరకు అనుమానాస్పదంగా వాహనాలు అమ్మేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్కు సమాచారం అందించాలని కోరారు.

## అమరాపురంలో శ్రీ గణేష్ రైతు సేవా కేంద్రం అభివృద్ధికి సహకరించండి



- ప్రారంభోత్సవంలో మాజీ ఎమ్మెల్యేలు,వైసిపి బిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

అమరాపురం, మే 13, మనంన్యూస్: మండలకేంద్రమైన అమరాపురంలో ని వైఎస్ఆర్ సర్కిల్ శిర రోడ్డులో నూతనంగా ఏర్పాటు చెసిన శ్రీ గణేష్ రైతు సేవా కేంద్రంను అభివృద్ధికి ప్రతి ఒక్క రైతులు సహకరించాల్సిందిగా మడకశిర మాజీ ఎమ్మెల్యే లు వైటి ప్రభాకర్ రెడ్డి,కరికెర సుధాకర్,మద్దన కుంట ఈరన్న,వై ఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హలుకూరు కాంతారాజులు తెలిపారు. బుధవారం రైతు సేవా కేంద్రం ప్రారంభోత్సవ ప్రత్యేక పూజ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మహా మంగళ హారతి తీర్థ ప్రసాదం స్వీకరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమరాపురం మండలం,తమ్మడేపల్లి గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు కె.సిద్దేష్ కుమార్ తనయుడు గణేష్ కుమార్ ఈ ప్రాంత రైతులకు మెరుగైన సేవలు అందించాలన్న తపనతో రైతు సేవాకేంద్రాను ప్రారంభించడం హర్షించదగ్గ విషయమన్నారు.కావున ప్రతి ఒక్క రైతులు కూడా ఆదరించి ఆశీర్వదించాల్సిందిగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,మాజీ ప్రజాప్రతినిధులు,నాయకులు,తదితరులు అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## మండలంలో జనగణన క్షేత్ర స్థాయి పరిశీలన

- ప్రజలు సిబ్బందికి సహకరించాలి
- జనగణన మండల ప్రత్యేక అధికారి ఎ. తాతరావు



శంఖవరం మే 13 మనం ప్రతినిధి : శంఖవరం మండలంలోని గ్రామాల్లో ఈ నెల 1వ తేది నుండి జరుగుతున్న జనగణన ఇప్పటి వరకు 30శాతం పూర్తయినట్లు జిల్లా అధికారి వెల్లడించిన విషయం తెలిసిందే.. శంఖవరం మండలంలోని నెల్లిపూడి కత్తిపూడి, శంఖవరం గ్రామాల్లో ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు చేస్తున్న జనగణన నమోదును జనగణన మండల ప్రత్యేక అధికారి తహసిల్దార్ ఎ. తాతారావు, ఏ ఎస్ ఓ పి మురళి బ్రహ్మ ప్రసాద్, తాసిల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ సయ్యద్ ఆసిఫ్ అలీ గ్రామపంచాయతీ కార్యదర్శి అప్పలరాజు క్షేత్రస్థాయిలో పరిశీలించి, పలు సూచనలు చేసారు. ఈ సందర్భంగా జనగణన మండల ప్రత్యేక అధికారి ఎ. తాతారావు మాట్లాడుతూ, జనగణనకు నిర్దేశించిన సమయం ఇంకనూ 20 రోజుల గడువు ఉందని, గడువు లోపున పూర్తిస్థాయిలో జనగణన చేయాల్సి ఉంటుందన్నారు. జనగణన సమయంలో ప్రజలు సంబంధిత సిబ్బందికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో జనగణన సూపర్వైజర్లు, యానిమేటర్స్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## సీపీఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ మాతృమూర్తి సంస్మరణ సభకు హాజరైన మాజీ ఎంపీ తలారి రంగయ్య



కళ్యాణదుర్గం టౌన్ మే 13 మనం న్యూస్: కళ్యాణదుర్గం భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యులు కె. రామకృష్ణ మాతృమూర్తి స్వర్గీయ కె. గౌరమ్మ సంస్మరణ సభ కర్నూలు జిల్లా ఆలూరు మండలం మొలగవల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనంతపురం మాజీ పార్లమెంట్ సభ్యులు, కళ్యాణదుర్గం వైఎస్సార్సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన స్వర్గీయ గౌరమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం సీపీఐ నేత కె. రామకృష్ణతో పాటు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా తలారి రంగయ్య మాట్లాడుతూ, గౌరమ్మ ఆదర్శవంతమైన జీవితాన్ని గడిపారు. సమాజ సేవకు, పేదల పక్షాన పోరాడే నిబద్ధత కలిగిన కె. రామకృష్ణ వంటి నాయకుడిని సమాజానికి అందించిన మాతృమూర్తి ఆమె. రామకృష్ణ ఎదుగుదలలో ఆమె పాత్ర ఎంతో కీలకం.

గౌరమ్మ మరణం వారి కుటుంబానికే కాకుండా ఈ ప్రాంతానికి తీరని లోటు అని అన్నారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య, జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, కళ్యాణదుర్గం నియోజకవర్గ కార్యదర్శి గోపాల్, సహాయ కార్యదర్శి నరసింహులు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రామకృష్ణ, అడ్వకేట్ వేణుగోపాల్, శెట్టూరు మండల కార్యదర్శి తిమ్మరాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే బ్రహ్మసముద్రం, శెట్టూరు, కళ్యాణదుర్గం రూరల్ మండలాల కన్వీనర్లు పాలబండ్ల చంద్రశేఖర్ రెడ్డి, ఎంఎస్ హనుమంతరాయుడు, గోళ్ళ సూరి, బ్రహ్మసముద్రం మండల అబ్జర్వర్ గణేష్, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి రామాంజనేయులు యాదవ్, మున్సిపల్ భాగం అధ్యక్షుడు దొడగట్ట మురళి, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, సీపీఐ శ్రేణులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై గౌరమ్మ కి అంజలి ఘటించారు.

## అనంత నగరపాలక సంస్థ వైపు చూడని జిల్లా కలెక్టర్.. ప్రత్యేక అధికారి పాలనలో పరిష్కారం కాని ప్రజా సమస్యలు

- ప్రశ్నించే గొంతుకలపై అక్రమ కేసులు
- మాజీ మేయర్ మహమ్మద్ వసీం ధ్వజం



అనంతపురం. మే 13.మనం న్యూస్ ప్రతినిధి.: నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారుల పాలనలో ప్రజా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అనంతపురం నగరపాలక సంస్థ మాజీ మేయర్ మహమ్మద్ వసీం పేర్కొన్నారు. బుధవారం తన కార్యాలయంలో మాజీ కార్పొరేటర్లు సైపుల్లా బేగ్, ఇషాక్, వైసీపీ నాయకులు చింతకుంట మధు, కిషోర్ లతో కలసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ మేయర్ మాట్లాడుతూ అనంతపురం నగర పాలక సంస్థలో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతున్న నేపథ్యంలో నగర ప్రజలు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు.నగరంలోని తాగునీటి సమస్యతోపాటు పారిశుద్ధ్య సమస్య అధికంగా ఉందన్నారు. నగర పాలక సంస్థ ప్రత్యేక అధికారిగా జిల్లా కలెక్టర్ ఉన్నప్పటికీ కనీసం ఒక్కసారి కూడా మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి నగర సమస్యలపై సమీక్ష నిర్వహించ లేదన్నారు. ప్రత్యేక అధికారుల పాలనలో జవాబు దారీతనం లేకుండా పోయిందని, తద్వారా నగరంలో సమస్యలు పెరిగి పోయాయన్నారు. ప్రస్తుత వేసవిలో తాగునీటి సమస్యపై ఎలాంటి ప్రణాళికలు కనిపించడం లేదన్నారు. నగర శివారు ప్రాంతాల్లో ఇప్పటికీ పైప్లైన్లు వేయాల్సిన పరిస్థితి ఉందని పేర్కొన్నారు. 940 హెచ్పీ మోటార్కు రూ.1.90 కోట్ల వ్యయానికి ఆమోదం తెలిపామని చెబుతున్నప్పటికీ ప్రజలకు సరైన నీటి సరఫరా లేదన్నారు. పారిశుద్ధ్య వ్యవస్థ అధ్వాన్నంగా మారిందన్నారు.గత వైఎస్సార్సీపీ పాలనలో క్లాప్ ఆటోలు ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించేవన్నారు.నగరంలోని 50 డివిజన్లలో ఉదయం 11 గంటలకల్లా పరిశుభ్రంగా కనిపించేవన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత క్లాప్ ఆటోలను తొలగించి వాటి స్థానంలో ట్రాక్టర్లను ఏర్పాటు చేశారన్నారు. చిన్న చిన్న వీధుల్లోకి ట్రాక్టర్లు వెళ్లే అవకాశం లేకపోవడంతో చెత్త పూర్తిగా నగరం బయటకు వెళ్లడం లేదన్నారు.పారిశుధ్యం లోపించిందన్నారు. ప్రజల సమస్యలపై వెంటనే స్పందించకపోతే వైసీపీ ఆధ్వర్యంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామని మాజీ మేయర్ హెచ్చరించారు.నగర ప్రజల తరఫున తమ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.



## గుత్తిలో గంజాయి, మట్కా నిర్వహిస్తున్న ముగ్గురు అరెస్ట్

గుత్తి, మే 13: (మనం న్యూస్ ): గుత్తి పట్టణంలో గంజాయి విక్రయాలు మరియు మట్కా నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులను గుత్తి పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రజలను డబ్బుల ఆశ చూపిస్తూ మట్కా ఆడిస్తూ, గంజాయి అమ్ముతున్నారనే ఖచ్చితమైన సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. పోలీసుల వివరాల ప్రకారం, అరెస్టు కాబడిన వారిలో మాతంగి రాము (44), మునగల కంబగిరి (39), నగదాని శివ (38) ఉన్నారు. వీరిని బుధవారం మధ్యాహ్నం గుత్తి-అనంతపురం రోడ్డులోని ఆంజనేయస్వామి గుడి వెనుక ఉన్న ఖాళీ ప్రదేశంలో పట్టుకొని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా నిందితుల వద్ద నుండి రూ.3 లక్షల మట్కా నగదు, 34 మట్కా చీటీలు, 3 బాల్ పెన్నులు, అలాగే 1,100 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అనంతపురం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, గుంతకల్లు డి.ఎస్.పి .శ్రీనివాస్ పర్యవేక్షణలో, గుత్తి సీఐ ఎం. రామారావు, ఎస్ఐ కె. సురేష్ మరియు వారి సిబ్బంది రెవెన్యూ అధికారులతో కలిసి ఈ దాడులు నిర్వహించారు. ఈ ఘటనపై గుత్తి పోలీస్ స్టేషన్లో క్రైమ్ నెంబర్.104/2026 కింద (ఎన్ డి పి ఎస్ ) చట్టం మరియు ఏపీ గేమింగ్ (మట్కా) చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు. ఈ కేసులో మరో ముగ్గురు వ్యక్తులు అరెస్టు కావాల్సి ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.




# సాయి సుదర్శన్ అరుదైన ఫీట్!

ఐపీఎల్ లో గుజరాత్ టైటాన్స్ క్రికెటర్ సాయి సుదర్శన్ది ప్రత్యేకమైన స్థానం. 2022లో ఐపీఎల్ అరంగేట్రం చేసినప్పటి నుంచి ఒకే జట్టుకు ఆడుతూ స్థిరమైన ప్రదర్శన కొనసాగిస్తున్న అరుదైన క్రికెటర్లలో సాయి సుదర్శన్ కూడా ఒకడు. ఐపీఎల్ 2026 సీజన్ లోనూ తన బ్యాటింగ్ తో అలరిస్తున్న సాయి సుదర్శన్ మంగళవారం సన్ రైజర్స్ తో మ్యాచ్ లోనూ 61 పరుగులతో మెరిశాడు.

తద్వారా ఐపీఎల్ లో ఒక అరుదైన ఫీట్ ను సాధించాడు. ఎస్ఆర్హెచ్ తో మ్యాచ్ లో అర్ధశతకం సాధించడం ద్వారా ఐపీఎల్ లో తాను ఎదుర్కొన్న అన్ని జట్లపై కనీసం ఒక ఫిఫ్టీ సాధించిన నాలుగో భారత ఆటగాడిగా, ఓవరాల్ గా ఐదో ప్లేయర్ గా సాయి సుదర్శన్ నిలిచాడు.



గతంలో గుజరాత్ కెప్టెన్ శుబ్ మన్ గిల్, సీఎస్ కే కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్, ఆర్సీబీ కెప్టెన్ రజత్ పటీదార్ తో పాటు ఎస్ఆర్ హెచ్ హిట్టర్ హెన్రిచ్ క్లాసెన్ ఈ ఫీట్ను సాధించారు. తమిళనాడుకు చెందిన సాయి సుదర్శన్ సీఎస్కేపై నాలుగు అర్ధశతకాలు, ఢిల్లీ క్యాపిటల్స్, పంజాబ్, రాజస్తాన్ లపై మూడు ఫిఫ్టీలు, కేకేఆర్, ముంబై, ఆర్సీబీలపై రెండు హాఫ్ సెంచరీలు, లక్నో, ఎస్ఆర్ హెచ్లపై ఒక్కో అర్ధశతకం సాధించాడు.

ఇక ఐపీఎల్ ఆరంభం నుంచి కొనసాగుతున్న భారత సీనియర్ క్రికెటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలు ఈ ఫీట్ ను అందుకోవడంలో విఫలమయ్యారు. ఈ సీజన్ లో పరుగుల వరద పారిస్తున్న సాయి సుదర్శన్ 500 పరుగుల మార్క్ను దాటాడు. తద్వారా వరుసగా మూడో సీజన్ లోనూ ఐదొందల పరుగుల మార్క్ ను దాటిగా ఆటగాడిగా సాయి సుదర్శన్ నిలిచాడు.

ఆరెంజ్ క్యాప్ రేసులో ప్రస్తుతం సాయి సుదర్శన్ 12 మ్యాచ్ ల్లో 501 పరుగులతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు.

# రసవత్తరంగా మారిన ప్లే ఆఫ్స్ సమీకరణలు

ఐపీఎల్ 2026 కీలక దశకు చేరుకున్న వేళ, ప్లే ఆఫ్స్ సమీకరణలు ఆసక్తికరంగా మారాయి. సీజన్ ప్రారంభంలో చెలరేగి ఆడిన జట్లు ప్రస్తుతం మెత్తబడగా.. అడపాదడపా ప్రదర్శనలతో ప్రారంభించిన జట్లు వరుస విజయాలతో దూసుకుపోతున్నాయి.



దశ తిరగబడి, అనూహ్యంగా పుంజుకున్న జట్ల జాబితాలో గుజరాత్ టైటాన్స్ ముందుంది. ఈ జట్టు రెండు వరుస పరాజయాలతో సీజన్ ప్రారంభించి, ఆతర్వాత హ్యాట్రిక్ విజయాలు, ఆతర్వాత మళ్లీ రెండు వరుస పరాజయాలు, వాటి తర్వాత వరుసగా ఐదు మ్యాచ్ ల్లో విజయాలు సాధించి, ప్రస్తుతం పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకుంది.

సీజన్ ప్రారంభంలో ఏమాత్రం అంచనాలు లేని గుజరాత్ ఒక్కసారిగా టైటిల్ ఫేవరెట్ గా మారిపోయిన వైనం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తుంది. ఈ జట్టు తదుపరి ఆడాల్సిన 2 మ్యాచ్ ల్లో (కేకేఆర్, సీఎస్కే) ఒక్కటి గెలిచినా ప్లే ఆఫ్స్ బెర్త్ ఖరారరవుతుంది.

గుజరాత్ ఇప్పటివరకు ఆడిన 12 మ్యాచ్ ల్లో 8 విజయాలు, 4 అపజయాలతో 16 పాయింట్లు కూడగట్టుకుంది. ఈ జట్టు రన్ రేట్ (0.551) కూడా మెరుగ్గా ఉంది.

అంచనాలు తల్లకిందులైన జట్లలో పంజాబ్, రాజస్థాన్ ముందువరుసలో ఉన్నాయి. ఈ రెండు జట్లు సీజన్ ప్రారంభంలో వరుస విజయాలు సాధించి పాయింట్ల పట్టికలో టాప్-2 జట్లుగా చలామణి అయ్యాయి. అయితే అనూహ్యంగా ప్రస్తుతం ప్లే ఆఫ్స్ రేసులో వెనుకపడ్డాయి. వీటిలో పంజాబ్ పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఈ జట్టు తొలి ఏడు మ్యాచ్ ల్లో ఒక్క అపజయం కూడా ఎదుర్కోలేదు. అయితే ఆతర్వాత అనూహ్యంగా వరుసగా నాలుగు మ్యాచ్లో పరాజయంపాలై, నాలుగో స్థానానికి పడిపోయింది.

తద్వారా ప్లే ఆఫ్స్ అవకాశాలను సంకటంలో పడేసుకుంది. ఇకపై ఆడబోయే 3 మ్యాచ్ ల్లో (ముంబై, ఆర్సీబీ, లక్నో) కనీసం రెండైనా గెలవకపోతే పంజాబ్ ప్లే ఆఫ్స్ అశలను వదులుకోవాల్సిందే.

పంజాబ్ ఇప్పటివరకు ఆడిన 11 మ్యాచ్ ల్లో 6 విజయాలు, 4 అపజయాలతో 13 పాయింట్లు ఖాతాలో కలిగి ఉంది. కేకేఆర్ తో జరగాల్సిన ఓ మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కావడంతో ఓ పాయింట్ లభించింది. నాలుగు వరుస పరాజయాలు ఎదుర్కొన్నా, రన్ రేట్ (0.428) ఇంకా మెరుగ్గానే ఉండటం పంజాబ్ కు ఊరట కలిగించే విషయం.

ఆరంభంలో అదరగొట్టి, ఆతర్వాత ఢిలా పడిపోయిన మరో జట్టు రాజస్థాన్. ఈ జట్టు సీజన్ ప్రారంభంలో నాలుగు వరుస విజయాలు సాధించి, ఆతర్వాత 7 మ్యాచ్ ల్లో కేవలం రెండు విజయాలు మాత్రమే నమోదు చేసి, ప్లే ఆఫ్స్ రేసులో బాగా వెనుకపడిపోయింది. ఈ జట్టు ఇకపై ఆడాల్సిన 3 మ్యాచ్లో (ఢిల్లీ, లక్నో, ముంబై) కనీసం రెండైనా గెలవకపోతే, ప్లే ఆఫ్స్ బెర్త్ పై ఆశలు వదులుకోవాల్సిందే.

ఇప్పటివరకు ఆడిన 11 మ్యాచ్ ల్లో ఈ జట్టు 6 విజయాలు సాధించి, 5 అపజయాలు ఎదుర్కొని పట్టికలో ఆరో స్థానంలో కొనసాగుతుంది. ప్రస్తుతం ఈ జట్టు ఖాతాలో 12 పాయింట్లు ఉన్నాయి. రన్ రేట్ (0.082) మెరుగ్గానే ఉంది.

హ్యాట్రిక్ పరాజయాలు.. హ్యాట్రిక్ విజయాలు

ఈ సీజన్ లో అనూహ్యంగా ప్లే ఆఫ్స్ రేసులోకి వచ్చిన జట్టు సీఎస్కే. ఈ జట్టు హ్యాట్రిక్ పరాజయాలతో సీజన్ ప్రారంభించినప్పటికీ.. ఆతర్వాత అనూహ్యంగా పుంజుకుంది. చివరి 8 మ్యాచ్ ల్లో హ్యాట్రిక్ విజయాలు సహా 6 విజయాలు నమోదు చేసి పాయింట్ల పట్టికలో ఐదో స్థానంలో కొనసాగుతుంది.

ఇకపై ఆడాల్సిన 3 మ్యాచ్ ల్లో రెండు గెలిచినా ఈ జట్టు ప్లే ఆఫ్స్ బెర్త్ ఖరారవుతుంది. సీఎస్కేకు రన్ రేట్ (0.185) కూడా మెరుగ్గా ఉండటం కలిసొచ్చే అంశం. ఈ జట్టు ఇప్పటివరకు ఆడిన 11 మ్యాచ్ ల్లో 6 విజయాలు, 5 అపజయాలు నమోదు చేసి, ప్లే ఆఫ్స్ రేసులో బలంగా నిలబడింది.

ప్లే ఆఫ్స్ రేసులో స్థిరంగా కొనసాగుతున్న మరో రెండు జట్లు ఆర్సీబీ, ఎస్ఆర్హెచ్. సీజన్ ప్రారంభం నుంచి స్థిరంగా రాణిస్తున్న ఆర్సీబీ ప్రస్తుతం పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో కొనసాగుతుంది. ఈ జట్టు ఇప్పటివరకు ఆడిన 11 మ్యాచ్ ల్లో 7 విజయాలు, 4 అపజయాలు ఎదుర్కొని 14 పాయింట్లు ఖాతాలో కలిగి ఉంది. ఈ జట్టు రన్ రేట్ అన్ని జట్లకంటే మెరుగ్గా (1.103) మెరుగ్గా ఉంది. ఆర్సీబీ తదుపరి ఆడాల్సిన 3 మ్యాచ్ ల్లో (కేకేఆర్, పంజాబ్, ఎస్ఆర్ హెచ్) రెండు గెలిస్తే సునాయాసంగా ప్లే ఆఫ్స్ బెర్త్ కన్ఫర్మ్ చేసుకుంటుంది.

ఎస్ఆర్ హెచ్ విషయానికొస్తే.. ఈ జట్టు 12 మ్యాచ్ ల్లో 7 విజయాలు, 5 అపజయాలతో పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో (14 పాయింట్లు, 0.331 రన్ రేట్) కొనసాగుతోంది. ఈ జట్టు ఇకపై ఆడాల్సిన 2 మ్యాచ్ లు (సీఎస్కే, ఆర్సీబీ) గెలిస్తే, మిగతా జట్లతో సంబంధం లేకుండా ప్లే ఆఫ్స్ కు చేరుకుంటుంది.

అధికారికంగా ప్లే ఆఫ్స్ అవకాశాలు ఉన్న మరో రెండు ఢిల్లీ క్యాపిటల్స్, కేకేఆర్. ఈ రెండు జట్లు టెక్నికల్ గా ప్లే ఆఫ్స్ రేసులో ఉన్నా, అది జరిగే పని కాదు. ఢిల్లీతో పోలిస్తే కేకేఆర్ కు కాస్త మెరుగైన అవకాశాలే ఉన్నా, అది కూడా అంత ఈజీ కాదు.

ప్రస్తుతం కేకేఆర్ ఖాతాలో 9 పాయింట్లు ఉన్నాయి. ఆ జట్టు ఇకపై ఆడాల్సిన 4 మ్యాచ్ ల్లో గెలిస్తే ప్లే ఆఫ్స్ రేసులో ఉంటుంది. ఢిల్లీ విషయానికొస్తే.. ఈ జట్టు ఇకపై ఆడాల్సిన 2 మ్యాచ్ ల్లో ఒక్కదాంట్లో ఓడినా లీగ్ నుంచి ఎలిమినేట్ అవుతుంది. ఇప్పటివరకు లక్నో, ముంబై ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించిన విషయం తెలిసిందే.

# భర్తతో విడిపోతున్నట్టు రూమర్లు.. స్పందించిన నటి మౌనీరాయ్

తన భర్త సూరజ్ నంబియార్ తో విడిపోతున్నట్లుగా వచ్చిన రూమర్లపై నటి మౌనీరాయ్ స్పందించారు. అవాస్తవాలను ప్రచారం చేయడం మానుకోవాలని సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. తమ వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించొద్దని విజ్ఞప్తి చేశారు. మౌనీరాయ్, సూరజ్ ఇన్ స్టాగ్రామ్ లో ఒకరినొకరు అన్ ఫాలో కావడంతో విడిపోతున్నారన్న ప్రచారం జరగ్గా నటి రియాక్ట్ అయ్యారు.




సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే మౌనీరాయ్ కొన్ని రోజులుగా భర్తతో ఉన్న ఫొటోలు పోస్ట్ చేయలేదు. మరోవైపు, సూరజ్ నంబియార్ ఇన్ స్టాలో పెళ్లి ఫొటోలు కూడా కనిపించడం లేదు. ప్రస్తుతం ఆయన ఇన్ స్టాగ్రామ్ ఖాతా అందుబాటులో లేకపోవడం గమనార్హం. అకౌంట్ ను డిలీట్ చేసినట్టు సమాచారం. 2022 జనవరిలో సూరజ్ నంబియార్- మౌనీరాయ్ వివాహం జరిగింది. 'నాగిని' సీరియల్ తో ఆకట్టుకున్న మౌనీరాయ్.. 'గోల్డ్', 'బ్రహ్మాస్త్ర' తదితర సినిమాల్లో నటించారు. 'కేజీయఫ్ చాప్టర్ 1' (కన్నడ), 'వేదా' (హిందీ) తదితర చిత్రాల్లో స్పెషల్ సాంగ్స్ తో అలరించారు.

# కొత్త డేట్‌తో వచ్చిన సమంత.. రిలీజ్ ఎప్పుడంటే..?

స్టార్ బ్యూటీ సమంత లీడ్ రోల్ లో నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'మా ఇంటి బంగారం' ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి బజ్ క్రియేట్ చేసింది. ఈ సినిమాను దర్శకురాలు నందిని రెడ్డి డైరెక్ట్ చేస్తుండటంతో ప్రేక్షకుల్లో ఈ మూవీపై మంచి అంచనాలు క్రియేట్ అయ్యాయి. ఇక ఈ చిత్రాన్ని తొలుత మే 15న రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. కానీ, కొన్ని కారణాల వల్ల ఈ చిత్ర రిలీజ్ డేట్ ను వాయిదా వేశారు.

ఇక ఇప్పుడు ఈ చిత్రానికి సంబంధించిన కొత్త రిలీజ్ డేట్ ను అధికారికంగా ప్రకటించారు. 'మా ఇంటి బంగారం' చిత్రాన్ని జూన్ 16న గ్రాండ్ రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. ఈ మేరకు ఓ సాలిడ్ పోస్టర్ ను కూడా వారు రిలీజ్ చేశారు. పట్టుచీర కట్టుకున్న సమంత చేతిలో తుపాకీ పట్టుకుని యాంగ్రీగా కనిపిస్తున్న ఈ పోస్టర్ సినిమాలో ఆమె పాత్రపై ఆసక్తిని రేకెత్తిస్తుంది.

ఇక ఈ చిత్రాన్ని ట్రలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్ నిర్మిస్తుండగా సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్నాడు. మరి ఈ సినిమాతో సామ్ బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి హిట్ అందుకుంటుందో చూడాలి.



# చెన్నై వరుడితో పెళ్లి..

## శ్రీలీల ఏమందంటే..?

టాలీవుడ్ యంగ్ సెన్సేషన్ శ్రీలీల ప్రస్తుతం చాలా సెలెక్టివ్ గా సినిమాలు చేస్తోంది. యూత్ లో తనకంటూ ఓ ప్రత్యేక బ్రాండ్ సంపాదించుకున్న ఈ యంగ్ బ్యూటీ వరుస ఆఫర్స్ తో అభిమానుల్లో అదిరిపోయే క్రేజ్ తెచ్చుకుంది. శ్రీలీల ఓ సినిమా చేస్తుందంటే, యూత్ ఆ సినిమాను చూసేందుకు థియేటర్లకు క్యూ కడతారు అనేలా ఆమె పేరు తెచ్చుకుంది. ఇక ప్రస్తుతం బాలీవుడ్, కోలీవుడ్ భాషల్లో సినిమాలు చేస్తున్న ఈ బ్యూటీ తాజాగా పెళ్లిపై కొన్ని ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది.

ఇటీవల చెన్నైలో జరిగిన ఓ ఈవెంట్ లో శ్రీలీల తన పెళ్లి గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించింది. తనకు చెన్నై అంటే చాలా ఇష్టమని.. అక్కడి అబ్బాయిలు చాలా మంచి వారని.. అక్కడ దొరికే దోశలంటే తనకు ప్రాణమని.. నయనతార లాగా తాను కూడా చెన్నై కుర్రాడితో పెళ్లి చేసుకుంటానేమో అంటూ శ్రీలీల కామెంట్ చేసింది.

ఇప్పుడు ఈ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. తెలుగమ్మాయి అయిన శ్రీలీల చెన్నై వరుడిపై మనసుపడిందని.. దీంతో ఆమె త్వరలోనే చెన్నై వరుడితో పెళ్లికి సంబంధించి ఏదైనా న్యూస్ చెబుతుందేమో అని సోషల్ మీడియాలో చర్చ సాగుతుంది.





# 'పెద్ది' నెక్స్ట్ సాంగ్‌కి డేట్, వేదిక ఫిక్స్..



మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా నటించిన లేటెస్ట్ సినిమా పెద్ది నుంచి ఇక వరుస అప్డేట్స్ ని మేకర్స్ స్టార్ట్ చేశారు. ఇటీవలే ట్రైలర్ డేట్ ని లాక్ చేసిన మేకర్స్ తాజాగా ముంబైలో ఈవెంట్ తో దీనిని లాంచ్ చేస్తున్నట్టుగా సాలిడ్ ప్రోమోతో అప్డేట్ అందించారు. ఇక దీనితో పాటుగా నెక్స్ట్ అప్డేట్ గా సినిమా నుంచి స్పెషల్ సాంగ్ గా మూడో పాటని ఖరారు చేశారు.

అంతే కాకుండా ఈ మే 23న ఆ సాంగ్ ని విడుదల చేస్తున్నట్టు బిగ్ అప్డేట్ ని అందించి వేదికగా భోపాల్ ని నిర్ణయించారు. దీనిపై వదిలిన కొత్త ప్రోమో కూడా ఇపుడు అభిమానులని, ఆడియెన్స్ ని ఎంతగానో ఆకట్టుకుంటుంది. సో ఈ స్పెషల్ సాంగ్ లాంచ్ ఏ లెవెల్లో ఉంటుందో చూడాల్సిందే. ఇక ఈ చిత్రానికి ఏ ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండగా జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటించింది. అలానే స్పెషల్ సాంగ్ లో శృతి హాసన్ కనిపించనుండగా జూన్ 4న సినిమా గ్రాండ్ గా పాన్ ఇండియా లెవెల్లో విడుదల కాబోతుంది.

# కేన్స్‌లో అలియా కామెంట్స్.. నెట్టింట విమర్శలు

బాలీవుడ్ అగ్ర కథానాయిక అలియా భట్ ప్రస్తుతం ఫ్రాన్స్ లో జరుగుతోన్న 79వ కేన్స్ ఫెస్టివల్ లో సందడి చేస్తున్నారు. ఈ వేదికగా భారతీయ చిత్ర పరిశ్రమలో పురుషాధిక్యత గురించి ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం చర్చనీయాశంగా మారాయి. భారతీయ బాక్సాఫీస్ వద్ద కేవలం పురుష ఆడియన్స్ ను మాత్రమే లక్ష్యంగా చేసుకుని సినిమాలు తీయడాన్ని ప్రశ్నించారు.

''ప్రపంచవ్యాప్తంగా 'బార్బీ' లాంటి మహిళా ప్రధాన చిత్రాలు భారీ విజయాన్ని సాధిస్తున్నాయి. కానీ, భారత్ లో మాత్రం ఎప్పుడూ హీరో ప్రాధాన్యం కలిగిన చిత్రాలే ఎక్కువగా తీస్తున్నారు. 75 శాతం సినిమాలు మాస్ ఆడియన్స్ ను దృష్టిలోపెట్టుకుని రూపొందిస్తున్నారు. మరి మహిళా ప్రేక్షకుల సంగతేంటి? వారికి కావాల్సిన సినిమాలు ఎవరు తీస్తారు?. నేను హీరో ప్రధానంగా సాగే యాక్షన్ సినిమాలు తీయొద్దని చెప్పడం లేదు.. కానీ సినిమాలు ఒక వర్గం కోసం మాత్రమే కాదని.. అందరి కోసం రూపొందించాల్సిన అవసరం ఉందని చెబుతున్నా. సినిమాల్లో ప్రధాన పాత్రలో ఎవరు నటిస్తున్నారనేది ప్రేక్షకులు చూడరు. వాళ్లు కథను మాత్రమే చూస్తారు'' అని అలియా స్పష్టం చేశారు.

ప్రస్తుతం ఈ కామెంట్స్ వైరల్ అవుతుండగా.. నెటిజన్ లు అలియాను విమర్శిస్తున్నారు. గతంలో తన భర్త నటించిన 'యానిమల్' హింసాత్మకంగా ఉందని కామెంట్స్ వచ్చినప్పుడు అలియా ఆ చిత్రాన్ని సమర్థించడాన్ని గుర్తుచేస్తున్నారు. ఇప్పుడు కేన్స్ లో ఇలా మాట్లాడటం ఎందుకంటూ కామెంట్స్ చేస్తున్నారు. మరోవైపు 'ధురంధర్' చిత్రంపై ఆమె ఇప్పటికీ మౌనం వహించడాన్ని కూడా తప్పు పడుతున్నారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No.New:3-88, Old : 3-22, Chandra Theatre, Gosala, Penamaluru Mandal, Krishna District,(AP),Pin -521151, And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.